ప్రజాశక్తి
సోపతి
ఫిబ్రవరి 15, 2015 ఆదివారం అనుబంధం

AUR



సంచలన నవలాకారుడు

పోచంపల్లి చే 'నేత'

- విహారి కథ : పేజీ తిప్పితే...
- మధుర స్వరాల రా'రాజు'
- అలనాటి రచన : భావార్ణవము
- ఏనుగు నరసింహారెడ్డి, నందకిశోర్ కవితలు



ఆత్మ సంభాషణలో సృజనకోణాలు

తన లోపలి ఆత్మ సంభాషణ గురించి ఎవరూ నేరుగా రాయలేరు, ఆత్మగమనాన్ని అర్థం చేసుకోడానికి మాత్రమే ప్రయత్నిస్తారని చెబుతారు వర్జీనియా వుల్ఫ్ (25 జనవరి 1882 – 28 మార్చి 1941). స్త్రీవాదాన్ని తనదైన కోణంలో నిర్వచించిన ఆమె రచన పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారు. ఆమె ప్రఖ్యాత రచన 'ఏ రూమ్ ఆఫ్ వన్స్ వాన్' ఇప్పటికీ చదివిస్తుంది: చదివిన కొద్దీ కొత్త ఆలోచనల భావధారతో మెదడు కాంతివంతమవుతుంది. కథలు, నవలలు, వ్యాసాలు రాయడమే గాక ప్రత్యేకించి నోట్‌బుక్స్, డైరీలు రాశారు వుల్ఫ్. దాదాపు 26 నోట్ బుక్స్‌లో విభిన్న అంశాలకు సంబంధించిన అంశాల్ని సృజించారు. ఇక డైరీ రాయడం ఆమె నిత్య వ్యాపకం. రచయిత్రిగా తన ప్రయాణాన్ని గురించి వాటిలో చెప్పారు. రచనా వ్యాసంగం దైనందిన జీవితంలో అలవాటుగా మారిన అనుభవంలోని వైచిత్రిని గురించి ఈ డైరీల్లో, నోట్‌బుక్స్‌లో ప్రస్తావించారు. ఆమె మరణానంతరం వాటిని 'వర్జీనియా వుల్ఫ్: ఏ రైటర్స్ డైరీ' శీర్షికన ప్రచురించారు. వుల్ఫ్ గురించి ప్రపంచమెరుగని అనేక విషయాల్ని వ్యక్తం చేసిందీ పుస్తకం. ఆత్మతో ఆత్మ చేసే సంభాషణే రచనగా భావించే వుల్ఫ్‌కు ప్రముఖ సాహితీవేత్తలు ఎందరో స్నేహితులున్నారు. రచనలకు, పుస్తకాలకు సంబంధించిన అనేక అంశాల సమాహారం 'వర్జీనియా వుల్ఫ్ రైటర్స్ డైరీ'. ఆమె నవలల్లోనూ, వ్యాసాల్లోనూ కనిపించని అనేక కోణాలు ఈ పుస్తకంలో తారసపడతాయి. సాహిత్యలోకంలో ప్రసిద్ధి చెందిన రచయిత్రి పలు అంశాలకు సంబంధించి ఏర్పరుచుకున్న అభిప్రాయాలు ఈ పుస్తకంలో దర్శనమిస్తాయి.

నాలుగు దశాబ్దాల క్లాసిక్ 'అంధీ'

నటిగా సుచిత్రాసేన్‌లోని ప్రతిభాసంపత్తిని వెలికితీసి ప్రపంచానికి చాటిన చిత్రం 'అంధీ'. ఆమెకే కాదు దర్శకునిగా గుల్జార్‌కే, కథానాయకునిగా సంజీవ్‌కుమార్‌కే, 'తేరే బినా జిందగీ...' గీతాన్ని పాడిన కిషోర్‌కుమార్, లతా మంగేష్కర్‌లకీ మంచిపేరు తెచ్చిపెట్టిన సినిమా అంధీ. మొదట 13 ఫిబ్రవరి 1975న విడుదలయింది. ఇందిరాగాంధీ ఆమె భర్త ఫిరోజ్‌గాంధీ మధ్య గల సంబంధాల్ని ఆధారంగా చేసుకొని ఈ చిత్రం నిర్మించారన్న ప్రచారం మొదట్లో జరిగింది. కానీ ఇది నిజం కాదు. అయినప్పటికీ ఈ సినిమా విడుదలయిన కొన్ని వారాల్లోనే నిషేధానికి గురయింది. ఎమర్జన్సీ కాలంలో ఆ నిషేధం కొనసాగింది. 1977 నాటి ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోయి జనతా పార్టీ ప్రభుత్వం వచ్చాకనే ఈ సినిమాపై నిషేధాన్ని ఎత్తివేశారు. అంతేగాక నాడు ఈ చిత్రాన్ని దూరదర్శన్‌లో కూడా ప్రసారం చేసింది ప్రభుత్వం. తర్వాత కాలాన ఫిలింఫేర్ అవార్డులు అందుకున్న ఈ చిత్రం ఈనాటికీ ప్రేక్షకుల్ని అలరిస్తోంది. బాలీవుడ్ క్లాసిక్స్‌లో ఒకటిగా ఈ చిత్రం గురించి చెప్పుకోవాలి. సంజీవ్‌కుమార్, సుచిత్రాసేన్‌ల సహజమైన నటన ఒక ప్రత్యేక ఆకర్షణ. గుల్జార్ రాసిన 'తేరే బినా జిందగీ...' పాట వింటే హృదయం ఆర్ద్రమవుతుంది. విన్నా కొద్దీ వినాలనిపించే పాట. దీనికి ఆర్.డి.బర్మన్ సమకూర్చిన సంగీతం అత్యంత మధురం. ప్రముఖ రచయిత కమలేశ్వర్ సమకూర్చిన కథ, కె.వైకుంఠ్ సినిమాటోగ్రఫీ ఈ చిత్రాన్ని క్లాసిక్‌గా రూపొందించాయి. ఈ సినిమాకు కథానాయిక పాత్రకు తొలుత వైజయంతిమాలని ఎంచుకున్నారు. కానీ ఆమె తిరస్కరించడం వల్ల సుచిత్రాసేన్‌కు ఆ అవకాశం దక్కింది. ఈ చిత్రం సుచిత్ర కెరీర్‌లో ఒక మైలురాయి. గుల్జార్ సృజించిన కళాఖండం అంధీ. అందుకే నాలుగు దశాబ్దాలయినా క్లాసిక్‌గా ఆకట్టుకుంటోంది.



■ అంతరంగం

మార్పు దిశగా...

విప్లవం లేని జీవితం మృత్యువుతో సమానం అన్నాడు ఇక్బాల్. ఈ సూత్రం మానవాళి అంతటికీ వర్తిస్తుంది. ఏ కాలంలోనూ ఎవరి జీవితమైనా విప్లవంతో ప్రభావితం కావడం అనివార్యం. మార్పును ఆవాహన చేసుకోవాలి. యథాతథవాదం వల్ల ఒరిగేదేం ఉండదు. ప్రతి తరం మార్పును ఆశిస్తుంది. ఒక దశ నుంచి మరో దశకి పురోగమించాలని ఆరాటపడుతుంది. దాస్యశృంఖలాల నుంచి ఈ దేశ విముక్తి కోసం తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకున్న కవి ఇక్బాల్ విప్లవాన్ని కోరుకున్నారు. ఈ క్రమాన అతని కవితాధార నిప్పుల ప్రవాహమై సాగింది. ధిక్కారంలోనే ఒక రచన పరిమళిస్తుంది. తలవంచడం నేర్చిన వాక్యానికి భవిష్యత్తు లేదు. అసలు కవిత స్వభావంలోనే తిరుగుబాటు తత్వం ఇమిడివుంది.

ఉన్న స్థితిని అంగీకరిస్తే రాయడానికీ, చెప్పడానికీ ఏదీ మిగలదు. కానీ ఏ కాలంలోనూ వర్తమాన స్థితిని సంపూర్ణంగా ఆమోదించగలిగే రీతిన సమాజాలు రూపొందలేదు. అందువల్లనే ఆదిమ కాలం నుంచి పోరాటం మానవ జీవనగమనంలో అంతర్భాగమైంది. ఒడిదుడుకులు ఉండొచ్చు. కొంతకాలం స్తబ్దంగా ఉన్నట్టు కనిపించవచ్చు. తిరుగుబాట్లు, విప్లవాలు సాఫల్యం కాకపోవచ్చు. అంతమాత్రాన ఉద్యమాలు ఆగవు. అసంతృప్తి చల్లారదు. ఈ కారణంగానే అడవుల్లో వుండే ఆదివాసులయినా, మహానగరాల్లోని శ్రమజీవులయినా పోరాటాల్లో భాగస్వాములవుతుంటారు. అనేక రూపాల్లో అసమ్మతిని వ్యక్తం చేస్తారు. ఆమోదయోగ్యం కానీ పాలనారీతుల్ని నిరసిస్తారు.

ప్రజాస్వామ్య వ్యవస్థల్లోనూ ఈ పరిణామాల పరంపర ఉంటుంది. నిజానికి 'ప్రజాస్వామ్యం' మాటల్లోనేగానీ ఆచరణలో సాకారం కాలేదు. అటు కుటుంబాల్లోగానీ, ఇటు సమాజాల్లోగానీ ప్రజాస్వామ్యం నెలకొనలేదు. ఆ పేరుతో నాటకం సాగించే రాజకీయాలు చెలామణిలో వున్నాయి. కానీ ఈ నాటకానికి తెరదించడం అవసరమని గుర్తించినప్పుడు మార్పు దిశగా ప్రయాణిస్తారు మనుషులు. రాజకీయాల అసలు రంగును అర్థం చేసుకొని వ్యవహరిస్తారు. వంచనాకళలో ఆరితేరడమే రాజనీతి అనే భావం ప్రబలినప్పుడు ప్రజలు చైతన్యంతో స్పందిస్తారు. ఎందుకంటే విప్లవించడం అనివార్యమయిన స్థితిలో ప్రజలున్నారు. మార్పు కోసం తపించడం, ఉద్యమించడం తప్పనిసరి.

ఈ ఆలోచన, వివేచన ప్రతితరంలోనూ ఏదో ఒక రూపంలో ప్రచలితమై ఉంటుంది. దీనిని గుర్తించినందునే విప్లవం లేని జీవితం మృత్యువుతో సమానమని కవి ఇక్బాల్ చెప్పారు. మానవ జీవితాన్ని మరింత ఉదాత్తం చేయడానికి ప్రయత్నించడం ప్రతి తరం కర్తవ్యం. మనుషులు శాంతంగా, నిశ్చింతగా మనుగడ సాగించే పరిస్థితులు నెలకొనే వరకు పోరాటం సమాజ గమనంలో అంతర్భాగం.

వెంటాడే వాక్యం

జీవితం ఓ పాఠం కాదు. ఓ అనుభవం తర్వాత మరో అనుభవం. ప్రతీ అనుభవమూ దేనికదే ప్రత్యేకమయింది.

\- పఠాభి

ప్రజాశక్తి
సోపతి
ఫిబ్రవరి 15, 2015

లేఖలు 4
సంగీతం
మధుర స్వరాల రారాజు' 5
కవర్‌స్టోరీ
పోచంపల్లి 'చేనేత' 6
కథ పేజీ తిప్పితే... 10
అలనాటి రచన
భావావర్ణము 13
నెమలీక 14
సీరియల్ ప్రేమ - విప్లవం 16
సృజన సంచలన నవలాకారుడు 18
చిట్టిబాబు ఊహాచిత్రాలు 20
జోక్స్ కార్నర్ 21
అనుబంధం
అనుబంధాల్లో మేనత్త పాత్ర 22
సోర్స్‌కోడ్
జీ మెయిల్‌లోని 10 ప్రయోగాత్మక ఫీచర్లు 23
సమీక్షలు
కాశీరాజు ఆత్మగీతం 24
చదివించే నవల హాఫ్ గర్ల్ ఫ్రెండ్ 25
ఈ వారం కవిత్వం
జలదృశ్యం 26

నల్లగొండ జిల్లాలోని పోచంపల్లి చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి. ఆ నేత వస్త్రాల వెనుక వున్న శ్రమైక జీవన సౌందర్యం ఈ వారం ముఖచిత్రకథనం.

లేఖలు



కొత్త నిర్వచనం

ప్రజాశక్తి గత వారం సంచికలో చక్కటి విషయాలు ప్రచురించారు. పుస్తకంలో ఇచ్చిన 'ఓ లోకం కోసం పక్షుల అన్వేషణ' కవర్ పేజీ స్టోరీ చాలా బాగుంది. చక్రవర్తి జీవిత చరిత్ర, సంగీతానికి ఆయన సేవలు గురించి వర్ణించిన తీరు ఆకట్టుకుంది. మహిళా సమస్యలపై పోరాడుతున్న సుభాషిణీ అలీ ఇంటర్వ్యూ కూడా బాగుంది. 'సినిమాకి కొత్త నిర్వచనం' చెప్పిన పద్మ భూషణ్ అవార్డు గ్రహీత జాహ్ను బారువా గురించి వచ్చిన వ్యాసం కూడా బాగుంది. సినిమా సమీక్ష అంటే ఉండాల్సిన విషయాలన్నీ అందులో ఉన్నాయి. అయితే జాతీయ, అంతర్జాతీయంగా విజయం సాధించిన మహిళల ఇంటర్వ్యూలు కూడా ఇస్తే బాగుంటుంది.

- వనపర్తి సాగర్, కరీంనగర్

ప్రకృతి మనుగడకు పక్షులు అవసరం

మన చుట్టూ వున్న ప్రకృతి సుభిక్షంగా ఉండాలంటే అన్నిరకాల జంతువులు, పక్షులు కూడా మనుగడలో ఉండాలి. ఈ లోకంలో ప్రతి జీవికి ఉనికి ఉంది. మానవుని అభివృద్ధి విధానాలు ఆ ఉనికిని హరించకూడదు. ఈ లోకంలో పక్షులు సురక్షితంగా ఉంటేనే మానవులు కూడా క్షేమంగా ఉంటారు. పక్షుల్లేని లోకాన్ని ఊహించలేం. అందుకని రేడియేషన్ కారకాలు పెరగకుండా చూసుకోవాలి. పక్షులు అంతరించకుండా జాగ్రత్త పడటం అవసరం. ఈ విషయాన్ని కవర్ కథనం నొక్కి చెప్పింది. కనుక ఇందుకు అనువైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలి.

- ఎస్. రమేష్, వరంగల్

తెలుగులో ఎందుకు రావు?

జాహ్ను బారువా గురించి వంశీకృష్ణ రాసిన వ్యాసం బాగుంది. సినిమా అంటే ఎలా ఉండాలో బాగా చెప్పారు రచయిత. వ్యాసం చదువుతుంటే ఇలాంటి మంచి సినిమాలు తెలుగులో ఎందుకు రావనే ప్రశ్న కలిగింది. జీవిత వాస్తవికతను చూపించే ప్రయత్నం సినిమాకళ చేయాలి. దీనికి తెలుగు సినిమా రంగం ఆమడదూరంలో ఉన్నట్టనిపించింది. కనీసం ఇలాంటి దర్శకుల సినిమాలయినా తెలుగు సినిమా రంగానికి చెందినవాళ్ళు చూస్తుంటారా అనిపించింది. ఈ వ్యాసం చదివాకయినే ముఖ్యంగా సినిమా వాళ్ళు బారువా సినిమాలు చూడాలి. ఆలోచించాలి.

- కె. శ్రీరామమూర్తి, నల్లగొండ

తెలంగాణ మాణిక్యం రావెళ్ల

ఈ వారం 'కవియోధుడు రావెళ్ళ' అంటూ ఎస్వీ రామారావు గారు అందించిన క్లుప్త పరిచయం బావుంది. అయితే ఇలాంటి వారి గురించి మరింత వివరంగా ఇవ్వాలి. తెలంగాణ ప్రజానీకంలో పౌరుషాగ్నిని రగిలించిన వారి గీతాల్నీ సిలబస్‌లో పెట్టాలి.

- డి.మోహన్, ఖమ్మం

పుస్తకం చదవాలనిపించింది

నెల్లూరి కేశవస్వామి కథల మీద సమీక్ష చదివితే వారి కథలు చదవాలనిపించింది. పాతబస్తీ గురించి తెలుగులో వచ్చిన కథలు అరుదు. ఆ రోజుల్లో ఓల్డ్ సిటీ ఎలా ఉండేదో తెలుసుకోవాలనిపించింది. కథల్ని పరిచయం చేసిన తీరు నచ్చింది.

- ఎం. రామకృష్ణ, కరీంనగర్

మన జాతీయాలు

అన్నీ యున్న విస్తరి

విస్తరిలో అన్ని వుంటే గాలికెగరదు, నిండుగా అణిగిమణిగి ఉంటుంది. విస్తరి అంటే తెలియనది కాదు తేలికైనది.చిన్నగా గాడ్పు వచ్చినంతనే ఎగిరిపోతుంది. చులకనైనది. అయితే విస్తరిలో రకరకాల వంటకాలు వడ్డిస్తే ఎగరదు. అన్ని ఉన్న విస్తరి ఎగరదు. మిడిమిడి జ్ఞానం గలవాడు మిడిసిపడతాడు. అన్నీ తెలిసినవాడిలా తిరుగుతూ ఉంటాడు. అమాయకులను మోసగిస్తూ ఉంటాడు. అల్పజ్ఞుడు ఖాళీ విస్తరి లాంటివాడని అర్థం. నిండుకుండ తొణకదు. విలువ గలవాడు ఎగిరి పడడు. విలువ లేనివాడి మోతనే ఎక్కువ. విలువ గలవాడు మితభాషి. అందుకే కంచు మోగినట్లు కనకంబు మోగునా అనే మాట వచ్చింది. ఈ తీరులోనే నిండుగా వున్న విస్తరి ఎగరదు. ఏమీ లేనప్పుడు లేదంటే చాలీచాలకుండా ఉంటే ఎగిరిపడుతుంది. అయితే ఇటీవలి కాలంలో విస్తరి ఉపయోగం తగ్గింది కనుక ఇది ఎక్కువగా ఈ జాతీయం వాడకం అరుదయింది.

ఇసుక తక్కెడ-పేడ తక్కెడ

ఈ పేరిట కథలు ఒకప్పుడు చెలామణిలో ఉండేవి. ఒకడు ఇసుకను బంగారమని అమ్మితే మరొకడు పేడను అమ్మేవాడు. నిజానికి ఇద్దరూ మోసగాళ్ళే. లోకులనే గాక తమకు తాము మోసగించుకునేవాళ్ళు. మోసవిద్యలో వాళ్ళు నేర్పరులు. ఈ ఇద్దరి గురించి ఎవరికీ చెప్పనక్కర్లేదు. ఒకరికొకరు తీసిపోరు. వీరు సమ ఉజ్జీలు. ఈ జాతీయాన్ని పోటీదార్ల విషయంలో, ఒకరిని మించి మరొకరు అని వాడుతుంటారు.

పెద్దపులి పాలు

ఆడ పెద్దపులి పిల్లలను కని, పాలిస్తుంది. పిల్లి, పంది, కుక్క మొదలైన జంతువులు ఈని, బాలెంతలయినపుడు ఏ జంతువును దగ్గరకు రానీయవు. పెద్దపులి అయితే మగపులిని దరిచేరనీదు. ఒకవేళ చొచ్చుకొనివస్తే రామ రావణ యుద్ధమే. పాత కాలపు కథల్లో రాజులు పెద్దపులి పాలు వైద్యానికవసరమని అది తెచ్చినవాడికి అర్ధ రాజ్యమో, రాజకుమారినో కట్టబెడతామని ప్రకటించే వారు. సవతి కుమారుణ్ణి సవతి తల్లి ఆ రాజకుమారుణ్ణి పెద్దపులి పాల కోసం పంపడం జరుగుతుండేది. పెద్దపులితో పెనుగులాడి పులిని చంపవచ్చునేమో కాని దాని పాలు పితుకుట అనేది అసాధ్యమైంది. ఇది కుందేటి కొమ్ములా లేని వస్తువు కాదు. ఉన్నదే కాని అసాధ్యం. ఈ అసాధ్యమైన వాటి సంగతుల్ని ప్రస్తావించాల్సినపుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

- యం.వి.నరసింహారెడ్డి

■ సంగీతం

మధుర స్వరాల రా'రాజు'

టి.వి.రాజుగా పరిచితులైన ఆయన పూర్తి పేరు తోటకూర వెంకట రాజు. 'టింగ్‌రాంగా' అనే చిత్రంతో సినీ సంగీత దర్శకత్వంలోకి అడుగు పెట్టిన టి.వి.రాజు తెలుగు, తమిళం, కన్నడం భాషల్లో మొత్తం వందకు పైగా చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'పల్లెటూరి పిల్ల, పిచ్చి పుల్లయ్య, బంగారు పాప, పాండురంగ మహత్యం' చిత్రాల్లో చిన్న చిన్న పాత్రల్లోనూ తెరమీద కనిపించారు. ఈయన సంగీతం అందించిన వాటిలో ఎన్టీఆర్ చిత్రాలే ఎక్కువగా ఉన్నాయి. సంగీత దర్శకులైన 'రాజ్–కోటి'లలో రాజ్ (తోటకూర సోమరాజు) ఈయన కుమారుడే. టి.వి.రాజు సంగీతం అందించిన 'పాండురంగ మహత్మ్యం, శ్రీ కృష్ణపాండవీయం, శ్రీ కృష్ణావతారం, ధనమా? – దైవమా?; తల్లా పెళ్ళామా?, భలే తమ్ముడు, కథానాయకుడు' చిత్రాల్లోని పాటల బాణీలు ఇప్పటికీ, ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

నీతిగా నిజాయితీగా ఉంటే డబ్బు సంపాందిచలేరన్నది లోకరీతి. నీతినిజాయితీగా బతకడానికి సంపాదించొచ్చేమో కానీ కోట్లకు కోట్లు కూడబెట్టడమన్నది జరగని పని అని చాలామంది ఒప్పుకునే నిజం. పైసాలోనే జల్సా ఉంది అని నీతినిజాయితీలు గాలికి వదిలేసి, మంచీచెడూ మర్చిపోయి డాబూ దర్పం ప్రదర్శించిన వారిదే ఈ లోకంలో పైచేయి. ఎన్టీఆర్, జయలలిత నటించిన 'కథానాయకుడు' చిత్రం కోసం దాశరథి రాసిన పాట "ఇంతేనయా తెలుసుకోవయా ఈలోకం ఇంతేనయా, నీతీలేదు నిజాయితీ లేదు ధనమే జగమయ్యా". దీన్ని ఘంటసాల బృందం పాడారు. ఇదే చిత్రంలో మరో పాట కొసరాజు రచించిన "వినవయ్యా రామయ్య ఏమయ్యా భీమయ్య, మన మంచే గెలిచిందయ్య... మన మాటే నిలిచిందయ్యా". ఎందరో మహామహులు త్యాగాలు చేసి తెచ్చిన స్వాతంత్ర్యం ఏ కొద్దిమందికో మాత్రమే కాకుండా దేశ ప్రజలందరికీ సమానంగా అందాలని, అలా పాలన చేసేవాళ్ళే నాయకులుగా వుండాలనే సందేశం ఇచ్చే ఈ పాటని ఘంటసాల, సుశీల పాడారు.

వయసు మాయ చేస్తుంది. దానికి ఆడ, మగ లేదా లేదు. ఆకర్షణకు లోనై ఆలోచించకుండా ముందడుగు వేస్తే కష్టాలు తప్పవు. దీనికి వయసుతో పని లేదు. ఎప్పుడైనా, ఎవరైనా మనసు తెలిసి మసలుకోవాలి. ఎన్టీఆర్, కె.ఆర్.విజయ నటించిన 'భలే తమ్ముడు' చిత్రంలో మహమ్మద్ రఫీ పాడిన పాట "ఎంతవారుగాని వేదాంతులైన గాని వాలు చూపు సోకగానే తేలిపోదురో కైపులో కైపులో... కైపులో...". ఈ సినిమాలోనే సి.నారాయణ రెడ్డి సాహిత్యం అందించిన "నేడే ఈ నాడే కరుణించె నన్ను చెలికాడే" పాటను మహ్మదర్ రఫీ, సుశీల ఆలపించారు. ఈ రెండు పాటలు ఇప్పటి తరాన్ని కూడా ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

జీవితంలో సుఖశాంతులు డబ్బుతోనే వస్తాయనుకోవడం పొరపాటు. రోజులో వెలుగు చీకట్లు ఎంత సహజమో జీవితంలో కష్టసుఖాలు కూడా అంతే. ఎన్టీఆర్, జమున నటించిన 'ధనమా? – దైవమా?' చిత్రంలో "నీ మది చల్లగా స్వామీ నిదురపో దేవుని నీడలో వేదన మరచిపో... ఏ సిరులెందుకు? యే నిధులెందుకు?" పి సుశీల పాడిన ఈ పాట వేదాంత సాహిత్యంలా కనిపిస్తుంది కానీ, వింటుంటే మాత్రం లాలి పాట వింటున్నంత హాయిగా వుంటుంది.

మనం చదివిన పురాణాల్లోని వ్యక్తుల మొదలు దేశం కోసం, సమాజం కోసం పాటు పడిన వాళ్ళందరి గొప్పతనాన్ని ఒక్కొక్కరి గురించి ఒక్కో వాక్యంలో తెలిపిన పాట "నీ ధర్మం నీ సంఘం నీ దేశం నవ్వు మరవద్దు... జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు". సావిత్రి, జగ్గయ్య, ఎన్టీఆర్, వాణిశ్రీ నటించిన 'కోడలు దిద్దిన కాపురం' చిత్రంలోని ఈ పాటని సి.నా.రె సాహిత్యం అందించారు. సుశీల గానం గానం చేశారు.

మనిషికి నిద్ర ఎంత అవసరమో అతి నిద్ర అంతే అనర్థదాయకం. జీవితంలో సగభాగం నిద్రతోనే సరిపోతుంది. మిగిలిన సమయాన్ని ప్రగల్భాలతోనో, పిరికితనంతోనో కాలక్షేపం చేస్తే జీవితంలో ఓడిపోవడం ఖాయమనే సందేశంతో వచ్చిన పాట 'శ్రీ కృష్ణపాండవీయం' చిత్రంలో కొసరాజు రాసిన "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా, ఆ మత్తులోన బడితే గమ్మత్తుగ చిత్తవుదువురా". ఈ పాటను ఘంటసాల ఆలపించారు. ఇదే చిత్రంలోని "ఛాంగ్‌రే బంగారు రాజా ఛాంగ్ ఛాంగ్ రే బంగారు రాజా మజ్జారే" పాటని జిక్కి పాడారు.

మనిషికి నిద్ర ఎంత అవసరమో అతి నిద్ర అంతే అనర్థదాయకం. జీవితంలో సగభాగం నిద్రతోనే సరిపోతుంది. మిగిలిన సమయాన్ని ప్రగల్భాలతోనో, పిరికితనంతోనో కాలక్షేపం చేస్తే జీవితంలో ఓడిపోవడం ఖాయం

పౌరాణికాల్లోని బాలకృష్ణుని లీలలన్నీ ఆబాల గోపాలాన్ని అలరించేంత గొప్పగా చిత్రించిన పాట ఎన్టీఆర్, అంజలి ఎన్టీఆర్, అంజలి నటించిన 'పాండురంగ మహత్యం' చిత్రంలోని "హే కృష్ణా ముకుందా మురారీ జయకృష్ణా ముకుందా మురారీ జయగోవింద బృందా విహారీ". కన్నవాళ్ళని, కట్టుకున్న భార్యా బిడ్డల్ని వదిలి, వాళ్ళని అవమానాల పాల్జేసి, తన సుఖసౌఖ్యాల కోసం వెంపర్లాడి, చివరకు తన తప్పు తెలుసుకుని కన్నవాళ్ళ సేవ చేసుకుందామనుకున్న ఓ వ్యక్తి పాడే పాట 'అమ్మా అని పిలిచినా ఆలకించవేమమ్మా ఆవేదన తీరు రోజు ఈ జన్మకు లేదా" జూనియర్ సముద్రాల సాహిత్యమందించిన ఈ రెండు పాటలను ఘంటసాల గాత్రంలో మాత్రమే వినాలనిపించేంత మధురంగా పాడారు.

ఇవే కాదు... "మంచివాడు మా బాబాయి మా మాటే వింటాడోయి కోపం మాని తాపం, ముత్యాల జల్లు కురిసే రతనాల మెరుపు మెరిసె వయసు మనసు పరుగులు తీసే, ఎర్రా ఎర్రాని దానా బుర్రా బుగ్గలదానా బుర్రా బుగ్గల మీద, ఈనాటి ఈ హాయీ కలకాదోయి నిజమోయి" లాంటి ఎన్నో అలనాటి మధురమైన పాటలు టి.వి. రాజు సంగీత సారథ్యంలో వెలువడ్డాయి.

– బి. మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ



ఒకప్పుడు పోచంపల్లి చీరలు కొన్ని ప్రాంతాలవారు, మధ్య వయస్సు వారు మాత్రమే ఇష్టపడేవారు. కానీ ఇప్పుడు వయోభేదం లేకుండా చీరకట్టు నేర్చిన యుక్త వయసు వారి నుంచి అమ్మమ్మల వరకూ పోచంపల్లి చీరపై మక్కువ చూపుతున్నారు. ఏ బట్టలషాపు కెళ్లినా మహిళల చూపు పోచంపల్లి చీరలవైపే..! గతంలో పోచంపల్లి చీరలు తెప్పించుకోవాలని చూసేవారు. కాని ప్రస్తుతం అక్కడి నేతపనితనం చూసిన వారెవరైనా పోచంపల్లి వెళ్లి చీరలు చూసొద్దామనే బయలుదేరుతారు. దేశ, విదేశాల మహిళలు సైతం హైదరాబాద్‌కు వస్తే పోచంపల్లి ఎక్కడుందని వాకబు చేస్తారు. మరి ఆ చేనేత చీరల విశిష్టత ఈ వారం ముఖచిత్ర కథనం.

పోచంపల్లి చేనేత

నల్గొండ జిల్లాలో ఉన్న పోచంపల్లి హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉంది. రాష్ట్ర రాజధానికి 35కిలోమీటర్ల దూరంలో ఉన్న పోచంపల్లి చేనేత, భూదానోద్యమానికి పురుడు పోసింది. ఇవాళ అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎందుకంటే, అక్కడి చేనేత కార్మికులు నేసిన చీరలు అందరినీ మురిపిస్తాయి. ఇక ఆడవారినైతే అమితంగా ఆకర్షిస్తాయి. చేనేతల్లో మొదటగా పేటెంట్ హక్కు పొందడం ఓ ప్రత్యేకతయితే.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ, భూదానోద్యమంలోనూ పోచంపల్లి ప్రత్యేకతను చాటుకుంది. అందుకే ఈ గ్రామం చరిత్రలో నిలిచిపోయింది. సాధారణ పడుచుల నుండి దేశ విదేశీ వనితల వరకూ అందరినీ ఆకట్టుకునే చేనేత ఉత్పత్తులు, చీరలతో ఖండాంతర ఖ్యాతిని పోచంపల్లి పొందింది. అనాడు అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను నేసిన నేతన్నలు ప్రస్తుతం అనేక డిజైన్‌లలో చేనేత బట్టలను నేసి, అందరినీ ఆకరిర్షించేలా చేస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల వారే కాకుండా, విదేశీయులు కూడా ప్రతి రోజూ ఇక్కడికి వస్తున్నారు. చేనేత కార్మికుల చేతుల్లో ఒదిగిన బట్టలను చూసి ఆశ్చర్యపోతున్నారు.

ఇక్కాత్ చీరలకు ఆదరణ

ఆడవారి అందానికి ఇక్కాత్ చీర మరింత రెట్టింపు చేస్తుంది. మగ్గాలపై చేనేత కార్మికుల చేతిలో మెరుగులు దిద్దుకుని స్వదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా కీర్తినార్జించిన ఈ చీర గురించి తెలియని మహిళలు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! పోచంపల్లి మాట వినగానే మహిళలకు వెంటనే గుర్తుకు వచ్చేది ఇక్కాత్ చీరలే. ఇక్కడ ఉత్పత్తి జరిగే చేనేత చీరలు 2వేల రూపాయల నుంచి యాభై, అరవై వేల రూపాయల వరకు ధర పలుకుతుందంటే నమ్మశక్యంగా ఉండదు. టాలీవుడ్, బాలీవుడ్ నుంచి ప్రముఖ సినీతారలు, రాజకీయ నాయకులు, ఇతర దేశాల నుంచి విచ్చేసిన మహిళలు సైతం పోచంపల్లి చేనేత కార్మికులు తయారుచేసిన చీరలవైపు మక్కువ చూపడం విశేషం.

ఇక్కాత్ చీరలను తిలకించాలంటే నల్గొండ జిల్లాలోని పోచంపల్లితో

ప్రభుత్వం సహాయం లేదు

మా తాతల తండ్రుల కాలం నుంచి మొగ్గం నేసి బతుకుతున్నాం. ఇంటిల్లిపాది ఈ మొగ్గం మీదే బతకాల్సి వస్తోంది. ఇంట్లో అందరూ పని చేసినా ఏమాత్రం కూలి రావడం లేదు. మేము చేసే కష్టమంతా ఇంటి అవసరాలకే సరిపోతుంది. ఇంట్లో ఎవరికైనా జ్వరమో, రోగమో వస్తే ఇంకా అంతే అప్పులు చేయాల్సి వస్తోంది. కంటి చూపు ఆనడం లేదు. చేతి నిండా పని దొరకడం లేదు. వేరే పని చేయలేం.. ఉన్న పనిని వదులుకోలేని పరిస్థితి ఉంది. అన్ని రకాల ధరలు పెరుగుతున్నాయి. నూలు, రంగుల ధరలు కూడా పెరిగాయి. చీరల ధరలు పెరిగితే మార్కెట్లో కొనలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వమే చేనేత ముడి సరుకును రాయితీపై సరఫరా చేయాలి. మేం నేసే వస్త్రాలకు ప్రభుత్వమే మార్కెటింగ్ కల్పించాలి. మా వస్త్రాలను ఎక్కువగా ఆదరిస్తే మాకు చేతి నిండా పని దొరుకుతుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- చిట్టిమల్ల ఉపేందర్, చేనేత కార్మికుడు

పాటు చౌటుప్పల మండలంలోని కొయ్యలగూడెం, కుంట్లగూడెం, ఎస్.లింగోటం, నేలపట్ల, జైకేసారం, రామన్నపేట మండలంలోని సిరిపురం, వెల్లంకి సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక, చండూర్ మండలంలోని గట్టుప్పల పలు గ్రామాలకు వెళ్ళాల్సిందే. పోచంపల్లి చీరలను కట్టుకుంటే తేజస్సుతో కూడిన నిండుతనం వచ్చేస్తుంది. సాంస్కృతి, సంప్రదాయాలకు ఈ చీర అద్దం పడుతుంది.

ఎంతో శ్రమించి చేనేత కార్మికులు చీరలను తయారుచేస్తారు. వారి జీవన పరిస్థితి కనాకష్టంగా సాగుతోంది. ఒక చీర నేయడానికి నాలుగు, ఐదు రోజుల సమయం పడుతుంది. చీర నేతకు ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. కాబట్టే చేనేత చీరలకు ఇంత విశిష్టత. ఒక చీర నేతకు ముగ్గురు చేనేత కార్మికులు పనిచేయాల్సి ఉంటుంది. రోజుకు 12గంటల చొప్పున చేనేత కార్మికులు ఏకధాటిగా శ్రమిస్తారు. ఈ చీరల తయారీ వెనుక చేనేత కార్మికుల అలుపెరగని కష్టం, కఠోర శ్రమ దాగి ఉంటాయి. రంగు రంగుల దారాల్లో నెమళ్ళు నర్తిస్తాయి. చిలుకలు నవ్విస్తాయి. ఏనుగులు గంభీరంగా నిలబడతాయి. పూవులు విరబూస్తాయి. ఆకులు రెపరెపలాడతాయి. రకరకాల ఆకృతులు మన ముందు కనిపిస్తాయి. బట్టలు నేసిన తరువాత రంగులద్దడం చాలా సులువు. కానీ పోచంపల్లి నేత ప్రత్యేకత ఏమిటంటే, నేయడానికి తీసి పెట్టుకున్న దారానికి రంగులద్ది, దానిని తరువాత నేస్తారు. పడుగు, పేక సమంగా కలవకుంటే, ఆ ఆకృతి నేతలో రానే రాదు. చాలా కష్టమైన, క్లిష్టమైన ప్రక్రియ కనుకనే పేటెంట్ లభించింది.

తయారీ ఇలా..

చిక్కులుగా ఉన్న పట్టు దారాల నుంచి ఒక్కో పోగును ఆధారం చేసుకొని రాట్నంపై వడుకుతారు. అలా వడికిన పట్టు మొత్తం కండెలకు చుడతారు. కండెల నుంచి దారమంతా ఆసు పోస్తారు. ఆసుకు రంగులు అద్దడానికి ముందు వివిధ రకాలైన డిజైన్లను ఎంపిక చేసుకుంటారు. ఎంపిక చేసుకున్న డిజైన్‌ను ఆసుపై గుర్తిస్తారు. గుర్తించిన ప్రదేశాలు మినహా మిగతా ఆసుకు రబ్బర్లు చుడతారు. వేడి చేసిన రంగునీటిలో రంగులద్దుతారు. దాన్ని ఆరబెట్టి ఆ తర్వాత రబ్బర్లు విప్పుతారు. అనంతరం వార్పు పరుస్తారు. దాన్ని మగ్గంపై నేస్తారు. మగ్గం నేసే క్రమంలో చేనేత కార్మికుడి చేతులు, కాళ్ల పని చేయాల్సిందే.. ఏ ఒక్కటి ఆగినా చీర రాదు.

పోచంపల్లి చేనేతలంటే కేవలం చీరలే కాదండోయ్, మగవారికి రక రకాల పట్టు చొక్కాలు, కుర్తాలు, ధోవతులు, లుంగీలు, టవళ్ళు, యువతులకు ప్రత్యేకమైన డ్రస్ మెటీరియల్, పట్టు చున్నీలు, పట్టు లంగాలు, ఓణీలు, కాటన్ టాప్స్, హ్యాండ్ పర్సు, కిటికీలకి ద్వారాలకీ తెరలు, దుప్పట్లు, దిండుగలీబులు, దీవాన్ పై పరిచేందుకు దుప్పట్లు, పోచంపల్లి నేత బట్టలతో కుట్టిన చేతి సంచులు, బాటిల్ బ్యాగ్, ఫ్రిజ్‌ను కప్పి ఉంచడానికి ఫ్రిజ్ కవర్, చేతి రుమాళ్ళు, సెల్ ఫోన్లు భద్రపరుచుకోవడానికి సెల్‌పౌచీలు ఇలా చాలా రకాలను చేనేత వస్త్రాలతో తయారు చేశారు.

పట్టు చీరలు : అన్ని రకాల చేనేత పట్టు చీరలు ఉన్నాయి. ఇక్కాత్, సెమీ ఇక్కాత్, నిలువుపేక చీరలున్నాయి. వీటితో పాటు చేనేత కాటన్ చీరలున్నాయి. ఇందులో మద్రాస్ చీరలు చాలా మృదువుగా, అందంగా ఉంటాయి. చిన్న పిల్లల లంగాఓణి కోసం పట్టు వస్త్రాలున్నాయి. వీటి ధరలు కూడా నేతలో ఆకృతులు పెరిగే కొద్దీ పెరుగుతుంటాయి. నూలు, పట్టు రకాలలో ఈ చేనేతలు అందుబాటులో ఉన్నాయి. మహిళల చీరల భాండాగారంలో ఎన్ని రకాలు ఉన్నా, పోచంపల్లి పట్టుచీర లేకపోతే ఏదో తక్కువైనట్లు భావించేవారు చాలా మంది తారసపడతారు. పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకే కాకుండా, రోజువారీగా కట్టుకోడానికి హుందాగా ఉంటాయని

వీటిని ఎక్కువగా ఉద్యోగినులు ఇష్టపడుతున్నారు.

చీరల తయారీలోనూ స్త్రీల పాత్ర

ప్రతి కుటుంబంలోను చిన్న పిల్లల దగ్గరనుంచీ అందరూ నేత పనిచేస్తారు. ముఖ్యంగా స్త్రీలకు ఇంటిపని, వంటపనితో పాటు మగ్గం పని కూడా తప్పనిసరి. నూలు వొడికి దారం తయారీ దగ్గర నుంచి మొదలు పెట్టి బట్ట తయారయ్యే అన్ని స్థాయిల్లోను చాలా ఎక్కువ సమయం చేసిన పనే చేస్తూ శ్రమ పడేది స్త్రీలే. వీరి ఇళ్ళల్లో అధిక స్థలాన్ని ఆక్రమించేది మగ్గాలే. అవే ఇంటికి కేంద్రబిందువు. దాని చుట్టూ నేయబడి వుంటాయి స్త్రీల జీవితాలు. నేతపనికి కేటాయించిన పనిగంటలంటూ ప్రత్యక్షంగా వుండవు. అయినప్పటికి కుటుంబ ఆదాయాన్నంతా లెక్క గట్టి చూస్తే కనీస వేతనాల్లో మూడోవంతు కూడా ఆదాయముండదు. ఇందరు పనిచేసినా నెలకు రూ. 1200–1500 దాకా మాత్రమే ఆదాయం గడిస్తారు. వచ్చిన ఆర్డర్స్‌ను బట్టి సభ్యులకి పని అప్పగిస్తారు. వారు చేసే ఉత్పత్తికి కూడా సంఘం మార్కెటింగ్ చేయాల్సి వుంటుంది. ఇది చాలా ఇబ్బందులతో కూడుకున్న పని. చేనేత సంఘాలకి సొంత షాపులు కానీ, పెట్టుబడులు కానీ లేవు.

ప్రభుత్వ మార్కెటింగ్ కరువు

చేనేత వస్త్రాలకు ప్రభుత్వం సరైన మార్కెటింగ్ కల్పించకపోవడం వల్ల చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేనేత వస్త్రాలు ప్రపంచ ఖ్యాతి పొందినా అందుకు తగ్గట్లుగా మార్కెటింగ్ నిర్వహణ లేదు. చేనేత వస్త్రాలకు సంబంధించిన ఎక్స్‌పో పెద్ద నగరాల్లో నిర్వహిస్తే చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరుగుతుంది. దాంతో పాటు సప్లయ్ పెరుగుతుంది. చేనేత కార్మికులకు చేతి నిండా పని దొరకడానికి అవకాశం ఉంది. కొన్ని చోట్ల ప్రభుత్వం చేనేత ఎక్స్‌పో నిర్వహిస్తున్నా అందులో చేనేత కార్మికులకు స్టాల్స్ కేటాయించడం లేదు. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు ఎక్స్‌పోలో స్టాల్స్ కల్పిస్తున్నారు. ఆప్కోకు ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా, బెంగళూరు వంటి పెద్ద నగరాలనుండి ఆర్డర్లు వస్తుంటాయి. ఆ వ్యాపారస్తుల నుండి అడ్వాన్స్‌లు తీసుకుని చేనేత వస్త్రాలు అందజేస్తుంటారు. ఇతర ప్రదేశాల్లో కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఆక్స్‌ఫామ్, సిఫామ్ లాంటి సంస్థలకి కూడా సరఫరా చేస్తుంటారు. కానీ మొత్తం వస్త్ర ఉత్పత్తులను చేనేత కార్మికులు అమ్ముకోలేకపోతున్నారు.

ఈ మధ్యకాలంలో పెరిగిన ఆదరణ

పోచంపల్లి చేనేత వస్త్రానికి ప్రత్యేకత ఉంది. ఇంత విశిష్టత కలిగిన టైఅండ్‌డై చీరలకు పేటెంట్ ఉంది. ఈ మధ్య కాలంలో చేనేత చీరలను అందులోనూ పోచంపల్లి చీరలను ఇష్టపడుతున్నారు. అన్ని రంగాలవారు పోచంపల్లి చీరలను మక్కువ చూపుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వినియోగదారులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. దాంతో పాటు హైదరాబాద్, విజయవాడ, వరంగల్ నగరాల నుంచి వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ చేనేత చీరల ముద్రను పవర్‌లూమ్ రంగం సొంతం చేసుకోవాలని చూస్తోంది. పెట్టుబడులు పెట్టి, ఎంతో శ్రమకోర్చి కార్మికులతో చీరలను తయారు చేయిస్తున్నాం. మరమగ్గాల మీద తయారు చేసిన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా చెప్పి అమ్ముతున్నారు. దాంతో మా వస్త్రాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. వస్త్ర ప్రదర్శనలోనూ వాటికే ఎక్కువ అవకాశాలు ఇస్తున్నారు. చేనేత వస్త్రాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.

– భాస్కర్, భావనరుషీ హ్యాండ్లూమ్ యాజమాని

చీరకట్టులో వీరికి సాటి ఎవరు?

ఇంట్లో ఉన్నప్పుడైతే చీర కట్టుకోవడం ఇబ్బందేమీ కాదు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో బయటికెళ్ళి ఉద్యోగాలు చేయాలి. మగవారితో సమానంగా, పవర్ డ్రెస్సింగ్‌లో భాగంగా బిజినెస్ క్యాజువల్స్ వేసుకోవడంపై నేటి మహిళలు ఆసక్తి చూపుతున్నారు. బోర్డు మీటింగులకు సూట్లు వేసుకోవడంపై మక్కువ చూపుతున్నారు. అయితే, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా చీరను కూడా పవర్ డ్రెస్‌గా మార్చుకున్న కార్పొరేట్ మహిళా దిగ్గజాలు ఉన్నారు. వారిలో ఐసిఐసిఐ బ్యాంకు సిఇఒ చందాకొచ్చర్, హెచ్ఎస్‌బిసి ఇండియా సిఇఒ నైనా లాల్ కిద్వాయ్, యాక్సిస్ బ్యాంకు సిఇఒ శిఖా శర్మ, విఎల్‌సిసి గ్రూప్ అధినేత్రి వందనాలూత్రా వంటి మహిళలు చీరల్లో బోర్డురూముల్లో దర్శనమిస్తున్నారు. మదర్ థెరిస్సా, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, బృందాకరత్, సుష్మస్వరాజ్, జయలలిత చీరకట్టు ప్రత్యేకత అందరికీ తెలిసిందే. ఎందరో విదేశీ మహిళలు మన దేశానికి వచ్చినప్పుడు చీరకట్టుతో కన్పిస్తారు. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ నటీమణులు కూడా ఇటీవల చీర కట్టుతో అందరి మనసుల్నీ దోచుకున్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

చేనేత రంగాన్ని కష్టాల ఊబిలోంచి బయట పడేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టాలి. ఆప్కోకు, చేనేత సంఘాలకు పేరుకుపోయిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. చేనేత సంఘాలకి ప్రధాన నగరాలలో షాపులు కేటాయించాలి. డిఆర్‌డిఏ, బ్యాంకుల ద్వారా వడ్డీలు లేని రుణాలు మంజూరు చేయాలి. రంగులు, సాంకేతిక ప్రక్రియలు, డిజైన్‌ల్లో అతివేగంగా మార్పులు రావాలి. పాలకులను చేనేతకారులు గొంతెమ్మ కోరికలేవీ కోరడం లేదు. కార్మికుల రెక్కల కష్టంపై రూపుదిద్దుకునే 11 వస్త్రాలైన పట్టుచీరలు, ధోవతి, తువ్వాళ్ళ, పరదాలు, దుప్పట్లు, వంటివి మరమగ్గాలు, కాటన్ మిల్లుల్లో ఉత్పత్తి కాకుండా చూడాలన్నదే ప్రధానమైన కోరిక. అదేవిధంగా చేనేత ముద్రతో మర మగ్గాల వస్త్రాలు విక్రయించకుండా నిలువరించాల్సి ఉంది. కార్మికులు నేసిన ప్రతి వస్త్రాన్నీ 'ఆప్కో' ద్వారా గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయించి, ముడిసరకును రాయితీ ధరలకు అందించాలి. కొత్త డిజైన్లపై కార్మికులకు శిక్షణ ఇప్పించాలి. మగ్గాల ఆధునికీకరణకు బ్యాంకు రుణాలు అందజేయాలి. తమిళనాడులో మాదిరిగా చేనేత వస్త్రధారణకు సంప్రదాయ గుర్తింపు ఇచ్చి, ఆ మేరకు విస్తృత ప్రచారానికి పాటుపడాలి. ఇలాంటి సరళ విధానాలు అమలుచేయగలిగితే, రాష్ట్రంలో చేనేత పరిశ్రమ పునర్వైభవం సాకారమవుతుంది.

– కూరపాటి రమేష్,

తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్‌కు దగ్గర్లోనే

హైదరాబాదు నుంచీ ఆటవిడుపుగా మౌంట్ ఒపేరా లేక రామోజీ ఫిల్మ్ సిటీ చూడాలని వెళ్ళేవారు – అదే దారిని వెళ్ళి పోచంపల్లిని ఒకసారి చూసి రావచ్చు. అలాగే ఇంట్లో శుభకార్యాలేవైనా ఉంటే, పోచంపల్లి గ్రామానికే వెళ్ళి పట్టుచీరలు కొనుక్కురావచ్చు. మనం అక్కడ కొంటే చవకగా కొనుక్కోడమే కాకుండా దళారీలకి చెల్లించేది తగ్గి, నేతన్నల చీరలకు మార్కెటింగ్ ఉంటుంది. చేనేత కార్మికుల చేతుల్లో ఒదిగిన వస్త్రాలను కొనడానికి పోచంపల్లికి వెళ్లగానే మెయిన్ రోడ్డుకు ఇరువైపుల చేనేత వస్త్రాల దుకాణాలున్నాయి. సుమారు 50పైనే పట్టుచీరల దుకాణాలున్నాయి. చేనేత వస్త్రాలను తయారు చేయించేది ఈ దుకాణాల సముదాయాల వారు కావడంతో హైదరాబాద్ లాంటి మహానగరాల్లో దొరికే ధరల కంటే సరసమైన ధరలకే లభిస్తాయి. దాంతో పాటు చేనేత సొసైటీలోనూ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులోనూ రకరకాల చీరలు, చేనేత వస్త్రాలు లభిస్తాయి. సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయి.

పోచంపల్లి పర్యాటకంగానూ పేరుగాంచింది. ఇక్కడ పర్యాటకుల తాకిడిని గుర్తించి పోచంపల్లితో ప్రత్యేకంగా చేనేత పార్కును ఏర్పాటు చేశారు. ఇక్కడ చేనేత వస్త్రాల కొనుగోలుకు, పరిశీలనకు వచ్చిన వారికి అన్ని రకాల వసతులు ఈ పార్కులో ఉన్నాయి. ఇక్కడ చేనేత ఉత్పత్తుల తయారీ విధానం కళ్లకు అతికినట్లు చూపేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు. అక్కడే సమావేశ హాల్, ఓపెన్ థియేటర్ లాంటివి ఆ పార్కులో ఉన్నాయి. పక్కనే చెరువులో బోటింగ్ కూడా ఉంది. పర్యాటక శాఖ నిర్లక్ష్యం వల్ల బోటింగ్ నిర్వాహణ సక్రమంగా లేదు.

కునారిల్లుతున్న చేనేత మగ్గాలు

కాటన్ మిల్లులు, మరమగ్గాల నిర్వాహకుల నుంచి చేనేత పరిశ్రమకు చావుదెబ్బలే తగులుతున్నాయి. నేత కార్మికుల రెక్కల కష్టాలపై 11 రకాల వస్త్రాలు రూపుదిద్దుకుంటాయి. మిల్లు యాజమానులు, మరమగ్గాల నిర్వాహకులు రాత్రికి రాత్రి యంత్రాలపై వాటిని తయారుచేస్తున్నారు. ఫలితంగా మగ్గంనేసే కార్మికులకు పనిలేకుండా పోతోందని ప్రణాళిక సంఘమే గతంలో ఓ అధ్యయనంలో నిగ్గుతేల్చింది. ఇలాంటి మోసాలను పాలకులు సమర్థంగా అరికట్టలేకపోతున్నారు. మరోవైపు పవర్‌లూమ్ వస్త్రాలకు చేనేత ముద్ర(హ్యాండ్‌లూమ్ మార్క్) వేసేసి వినియోగదారుల కళ్లకు గంతలు కడుతున్నారు. చేనేత రంగం ఉసురు తీస్తున్న ఇలాంటి పెడపోకడలను ప్రభుత్వం నిలువరించకపోవడంవల్ల, రాష్ట్రంలో మగ్గం నేసే కార్మికుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. చేనేత ముద్ర దుర్వినియోగం కావడమూ తమ కష్టాలకు కారణమన్న కార్మికుల రోదన పాలకుల చెవులకు సోకడం లేదు.

మార్కెట్లలో చేనేత వస్త్రాల పేరుతో మోసం

ఇతర ప్రయివేటు వ్యాపారస్తులు తక్కువ నాణ్యతగల చేనేత వస్త్రాలను చవక ధరలకి అమ్ముతున్నాయి. వినియోగదారులను మోసం చేస్తున్నాయి. రంగులు, నూలు, నేత డిజైన్లలో నాణ్యత గల చేనేత సంఘాల అమ్మకాలకు గండికొడుతున్నాయి. కుదించిన అంటే పొడుగు, వెడల్పు తగ్గిన సైజులు, నాసిరకం రంగులు నఫ్థాల్ రంగులు, సింగల్ యార్న్ పద్ధతిని వాడి రూ. 150 ధర పలికే బట్టలను ప్రయివేటు వ్యాపారస్తులు రూ. 110 కే అమ్మగలుగుతున్నారు. వారు కోయంబత్తూరు, బొంబాయి మార్కెట్‌ల నుంచి రెండో శ్రేణి నూలు కొనుగోలు చేసి వస్త్రాలను తయారు చేసి చవకగా అమ్మగలుగుతున్నారు. అయితే చేనేత సంఘాలు ఈ విధంగా చేయలేవు. జాతీయ చేనేత అభివృద్ధి సంస్థ, సహకార సంఘాలకు నాణ్యమైన నూలుకు సరఫరా చేస్తుంది. సంఘాలు వెజిటబుల్ రంగులు మాత్రమే వాడాలి, బట్ట నాణ్యత కాపాడాలి, అందుకే అవి తక్కువ ధరలకు అమ్మడానికి వీలుపడదు. పవర్‌లూమ్ వస్త్రాలను చేనేత వస్త్ర ప్రదర్శనలో 70శాతం వరకు అమ్ముతున్నారు. ముఖ్యంగా చేనేత వస్త్రాలు అని చెప్పడం వల్లే పవర్‌లూమ్ వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో అసలు చేనేత వస్త్రాలు పేరుకపోతున్నాయి. పవర్‌లూమ్ వస్త్రాల పరిధిని తగ్గించాలి. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని వాటిని నిలువరించాలి.

– బయ్యు దామోదర్, 9705368884

■ కథ

పేజీ తిప్పితే...

సాహిత్య సభ జరుగుతోంది.

అంతా హడావిడిగా, గడబిడగా వుంది. వేదిక మీది కంటే హాల్లో నుంచే రణగొణ ధ్వనులు వినిపిస్తున్నాయి. ఇలాంటి సభలకు వచ్చే వారిలో ఎనభై శాతం ప్రేక్షకులు - అనేది చెణుకు!

నా పక్క కుర్చీలో జుబ్బా అడిగింది "ఆ మాట్లాడే ఆవిడ ఎవరండీ?"

పేరు చెప్పాను. "చూస్తే వాళ్ళంతా సొమ్ముల్తో సినిమా తారలా గ్లామరస్‌గా ఉంది. మాటలు వింటుంటే సామ్రాజ్యవాదం మీద కత్తులు నూరుతోంది" ఇదీ ఆయన వ్యాఖ్య!

చుట్టుపక్కల నుంచీ నవ్వులు. 'మనిషి బాగుంది' - మరో ఉద్ఘాటన! 'విశిష్ట అతిథి కదా!' మరో అభిప్రాయం. అదీ ఒక మహిళామణి నుండీ! మళ్ళీ పకపకల దొంతర!

ఆమె ప్రసంగం అయిపోయింది. తాను అర్జెంటుగా మరో సభకి వెళ్ళాలంటూ లేచి నిలబడింది. కార్యకర్తలు అత్యవసరంగా ఆమెకి 'చిరు' సత్కారం చేసి వీడ్కోలు పలికారు. ప్రేక్షకుల్లోనూ కొందరు తమంత తామే సెలవు చెప్పుకున్నారు. వేదిక మీద ఆత్మీయ అతిథి మైకు ముందుకొచ్చాడు.

"ఇప్పుడు అసలైన సమావేశంలోకొచ్చాం మనం" అంటూ చిన్నగా నవ్వి విషయ ప్రస్తావనలో ఉపోద్ఘాతం మొదలెట్టాడు.

పెరుమాళ్ బాలమురుగన్ నవల 'మథోర్ బినగ్' మీద జరుగుతున్న రచ్చని వివరించాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల దురంతాల్ని చెప్పుకొచ్చాడు. రచయితల మీది ఆంక్షల్ని దుయ్యబట్టాడు. బెరోల్ట్ బ్రెష్ట్ తనమీది ఆకాంక్షలకి వ్యతిరేకంగా కోపంగా అన్న మాటల్ని గుర్తు చేశాడు. మళ్ళీ మరోసారి పెద్దగా ' యు ట్రీట్ మీ లైక్ ఎ లెయిర్, ఐ ఆర్డర్ యు, బర్న్ మి' అన్న బ్రెష్ట్ మాటల్ని మైక్‌లో ఉగ్రంగా, ఆవేశంగా అన్నాడు.

సభ నిశ్శబ్దమైంది.

'ఇప్పుడు మురుగన్ మీద, అతని నవల 'వన్ పార్ట్ ఉమన్' మీద జరుగుతున్న దాడికి అర్థం పర్థం ఉందా అని ఆక్రోశించాడు. చరిత్రలో అక్షరం మీద జరిగిన చాలా అత్యాచార ఘటనల్ని శ్రోతల ముందు పరచాడు. చివరికి రచయితగా 'నేను మరణించాను' అన్న మురుగన్ నిర్ణయానికి సాహితీపరులంగా మనమంతా సిగ్గుపడాలి' అంటూ ముగించాడు.

హాల్లో వాతావరణం గంభీరంగా మారింది.

రామ్మోహన్ లేచి పోడియం ముందుకు వచ్చాడు. నిజానికి నేను అతనీ సభలో పాల్గొంటున్నాడని తెలిసే వచ్చాను.

కార్యక్రమం విషయం - 'సామ్రాజ్యవాద ధోరణుల పట్ల కవులు, కళాకారులు, సామాన్యుల నిరసన'.

'ఇప్పుడు మురుగన్ వ్యవహారం - మొదటి అంశం ముగిసింది' అని ముందటి వక్త వైపు చూసి సన్నగా నవ్వాడు.

రామ్మోహన్ బాగా చదువుకున్నవాడు. మేధావి. మేధావి వర్గంలో గౌరవం కలిగినవాడు. వామపక్ష భావజాలం పట్ల నిబద్ధత కలవాడు.

తన విలక్షణ ప్రసంగానికి అనుగుణంగా - రామ్మోహన్ స్థానిక పరిస్థితులతో మొదలుపెట్టాడు. తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్న 'ఓరల్ బిల్డింగ్ కల్చర్' గురించి హాస్యంతో, వ్యంగ్యంతో చెణుకుల్ని గుప్పించాడు. ప్రసంగం ఉత్సాహకరంగా వుంది.

రామ్మోహన్ శ్రోతల్ని మొదటి పది నిమిషాల్లోనే ఆకట్టుకున్నాడు. క్రమంగా శ్రోతలూ అతనికి కట్టుబడ్డారు!

క్రమంగా అతను మరింత సీరియస్ అంశాల్లోకి ప్రవేశించాడు. మూసివేత దిశగా రెండు వందల ఇంజనీరింగ్ కళాశాలల వ్యవహారం చెప్పాడు. కార్పొరేట్ కల్చర్‌లో వ్యాపారంగా మారిన విద్య, వైద్యం, ఆహారం గురించి ఉదాహరణలతో వివరించాడు. మాఫియాల్ని గురించీ, ప్రత్యేకించి 'అక్కడ రియల్ మాఫియా, ఇక్కడ ఇసుక మాఫియా' అని ఏవో వివరాలు చెప్పబోతూ క్షణం సేపు ఆగి శ్రోతల్ని గమనించాడు. వాళ్ళల్లో ఒకింత అసహనాన్ని అర్థం చేసకున్నాడు. "సరి. ఇవన్నీ మీకు తెలియని

విషయాలేం కావు" అని మళ్ళీ ఆగాడు.

ఇప్పుడు – ప్రపంచీకరణం పూర్తి పర్యవసానాల్ని గురించి ఆలోచించండి. అమెరికా వాడి అణుబంధం మనకేమన్నా అవగతమవుతోందా? మోడీ గారి ఒబామా గాఢాంలింగనం వెనుక చర్చ ఏమిటి? ఇద్దరూ చెప్పరట. పిటీ... పిటీ... ప్రజాస్వామ్యంలో ఉన్నామా మనం?"

కార్యకర్త ఎవరో ఒక స్లిప్ తెచ్చి ఇచ్చాడు.

చూశాడు రామ్మోహన్. "వీరెవరో దళితులకి జరుగుతున్న అన్యాయం మీద మాట్లాడమంటున్నారు" అన్నాడు.

హాల్లో కలకలం చెలరేగింది. 'అఖ్ఖర్లేదు. అఖ్ఖర్లేదు. అదంతా ప్రభుత్వాన్ని అన్ పాపులర్ చేయాలనే కుట్ర' అని ఎవరో అరిచారు.

"సరి సరి" అంటూ మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్ అని స్లోగన్‌లు కొట్టారు. పది లక్షల బ్రిటన్ కోటు ధరిస్తారు" అని, "రాహుల్ గాంధీగారి విసుర్లు ఇవి" అని అన్నాడు.

సభ ప్రసన్నమైంది. పీకే సినిమా మీదా, గోపాల గోపాల సినిమా మీదా సరదాగానే వ్యంగ్యాన్ని గుప్పించాడు రామ్మోహన్.

సభలో నవ్వులు, ఎగసినై. చిరునవ్వులు విరిసినై. "ఈ దేశంలో దేవుడి పేర జరిగే వ్యాపారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఉన్నదా? – ఆలోచించండి" అని మూఢనమ్మకాల మీద, దొంగ స్వామీజీ, బాబాల వ్యవస్థ మీదా ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు.

శ్రోతల్లో కొందరు టైమ్ చూసుకున్నారు.

ఎనిమిదీ పదిహేను! రామ్మోహన్ ముగిస్తే ఇంకా ఇద్దరు వక్తలు మాట్లాడాలి. నేనూ కొంచెం ఇబ్బందిగా దిక్కులు చూశాను. హాలు పలచబడుతోంది. నేను మధ్య వరుసలో ఉన్నాను.

రామ్మోహన్ మళ్ళీ మొదలెట్టాడు. "చాపకింద నీరులా ప్రవేశించే వ్యవహారాల్ని గురించి ఆలోచించండి. ప్రజల నాడీని తెలుసుకోవటానికీ, వారి వారి సహస్య ఎజెండాని చేరవేయటానికీ దొంగ దెబ్బ తీస్తూవుంటాయి ప్రభుత్వాలు. రాజ్యాంగ పీఠికలో 'సెక్యులర్' పదం జారిపోవటం గురించి ఆలోచించండి సారూ. గాడ్సే దేశభక్తిని గుర్తు చేసుకోండి. భూ సేకరణ చట్టాన్ని తెలుసుకోండి..." అని ఆగాడు.

"ఇవన్నీ మన నరాల మీద ఒత్తిడిని పెంచుతున్నాయా లేదా? అని ప్రశ్నించుకోండి మిత్రులారా" – అని "చివరగా ఒక్క దారుణాన్ని ప్రస్తావించి నా ప్రసంగాన్ని విరమిస్తాను" అంటూ "ఇప్పుడు దేశం ముందుకో కొత్త నినాదం లేదా సందేశం లేదా ఆదేశం వచ్చింది. హిందువులంతా కనీసం నలుగురు సంతానాన్ని కనాలట!" అని హాలంతా చూపుల్ని సారించాడు.

కొందరు పెద్దగానే నవ్వారు.

అదిగో సరిగ్గా అప్పుడే సభలో నుంచీ ఒక పెద్దాయన నిలబడ్డాడు. "రామ్మోహన్‌గారూ మీ స్పీచ్‌ని టాలరేట్ చేస్తున్నామని అనవసరంగా రెచ్చిపోకండి. సున్నితమైన అంశాలమీద వివాదాస్పదంగా మాట్లాడకండి. మిమ్మల్ని కూర్చోబెట్టి మేం చాలా చెప్పాల్సి వుంటుంది" అన్నాడు చాలా సీరియస్‌గా.

సభ ఉద్రిక్తంగా మారింది. మరోమూల నుంచీ "అదేం వివాదాస్పదమైన అంశం కాదు. పిచ్చి ప్రేలాపన. దుర్మార్గపు కుట్ర, ప్రజల్ని విభజించి పాలించే గేమ్ ప్లాన్" అనే అరుపులు వినిపించాయి. ఇంకో పక్కనుండీ "అదే మేమూ చెబుతున్నాం. మాకు నీతులు చెప్పే సూడో సెక్యులరిస్ట్‌లకి అవతలి వారి గురించి మాట్లాడే దమ్ము లేదేం?" అని ఒక మీసాల యువకుడు లేకచి పిడికిలి బిగించాడు.

రామ్మోహన్‌లాంటి అనుభవం గల వక్తకే పరిస్థితి అదుపు చేయలేని సందర్భం అది. అటూ ఇటూ మాటలు దూసుకుపోతున్నై. కార్యకర్తలు ఎవర్నీ శాంతింపజేయలేకపోతున్నారు.

"శ్రోతలకి చిన్న మనవి. మా కార్యక్రమంలో ఇలాంటి అపశ్రుతులు ఏనాడూ జరగలేదు. నిజంగా ఇది దురదృష్టకరమైన సంభవం. సరి. ఒక చిన్న విజ్ఞప్తి. ఈ హాలు మనకు తొమ్మిది గంటల వరకే ఇచ్చారు. ఇప్పుడు తొమ్మిది దాటింది. కనుక సభ ముగిస్తున్నాం. ఇంకా ప్రసంగించవలసిన అతిథులకి మమ్మల్ని క్షమించమని మనవి చేస్తున్నాం" అని ఆ సాహితీ సంస్థ కార్యదర్శి ప్రకటించాడు.

సభ అర్థాంతరంగా ముగిసింది.

శ్రోతల్లోని కొందరి ఉద్రేకం మాత్రం తగ్గలేదు. మాటల యుద్ధంతోనే కాళ్ళు బయటికి నడిచాయి.

హాల్లో లైట్లు బందయినై.

బయటికి వచ్చి రోడ్ వారగా నిలిచాను. నగరం చలితో వణుకుతోంది.

ఎదురుగా మా రాజేశం!

ఆశ్చర్యమూ, ఆనందమూ! ఇద్దరమూ ఒకేసారి 'అరే... అరే!' అనీ, 'మీరూ వచ్చారా?' అనీ అనుకున్నాం. ఎన్నడో కలిగిన పరిచయం. కాలక్రమాన వెలిసిపోయింది.

కుశల ప్రశ్నలూ, పరామర్శలూ అయినై.

"అదంతే. నాకున్న ఏకైక సంతానం – మా రమేశ్. అమెరికా నివాసి. అక్కడమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలట. మాకు తెలీదు. స్కైపులూ గట్రా మా అందుబాటులో లేవు. అక్కడనుంచీ పైసా రాదు. ఉన్న మిద్దెలో ఒక భాగానికొచ్చే అద్దెలో మీ చావు మీరు చావండని వదిలేశాడు. అదీ మా ఆవిడ ఘోష!"

"ఉదయం నుంచీ ఇంట్లో కూచుని కూచుని తోచి చావదు. అంతో ఇంతో సాహిత్యం గట్రా ఇంట్రస్ట్ కదా – అందుకూ ఈ సభలకి రావటం" అన్నాను. నా రాకకి వివరణనిస్తూ.

"నా సంగతి నీకు తెలుసుగా. కొంచెం ప్రశాంతంగా నిద్ర పోయే స్థలం కావాలి" అని గలగలా నవ్వాడు రాజేశం. "లేకపోతే మా ఆవిడ చెప్పే కొడుకూ కోడలి కబుర్లు వినలేక చావాలి"

నేను అదేం అన్నట్లు చూశాను.

"అదంతే. నాకున్న ఏకైక సంతానం – మా రమేశ్. అమెరికా నివాసి. అక్కడమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలట. మాకు తెలీదు. స్కైపులూ గట్రా మా అందుబాటులో లేవు. అక్కడనుంచీ పైసా రాదు. ఉన్న మిద్దెలో ఒక భాగానికొచ్చే అద్దెలో మీ చావు మీరు చావండని వదిలేశాడు. అదీ మా ఆవిడ ఘోష!" చెప్పాడు. నాకు బాధ కలిగింది.

"ఎంతొస్తుంది?" యథాలాపపు ప్రశ్న.

"ఎంతో ఎంత? రెండు వేలు. దాన్లోనే అన్ని అవసరాలూ గడుపుకోవాలి" అని, "చూడు నరేందరా. ఇందాక ఆయనెవరో లేవనెత్తిన విషయం గురించి ఆలోచిస్తుంటే ఈ ఒంటికాయ శొంఠికొమ్ము కాకుండా నలుగురు సంతానం ఉంటేనే బాగుండి ఉండేదేమో అనిపిస్తోంది" అన్నాడు.

రాజేశం గత జలసేతు బంధనం చేస్తున్నాడు. రెప్పలార్పకుండా అతని ముఖంలోకి చూస్తూ ఏదో అడగబోయాను. ఇంతలో శంకరం పక్కకొచ్చి

నిలిచాడు. "ఏం మాస్టారూ ఇంటికేనా?" అడిగాడు నన్ను ఉద్దేశించి.

"అవును సారూ. ఏదో మాట్లాడుతూ నిలబడ్డాను కానీ, లోపల ఆందోళనగానే ఉంది - ఇంత లేటుగా సలీం నగర్ చేరటమెలాగా అని. ఆపద్బాంధవుడిలా తగిలారు. మీరెప్పుడూ అంతే - నాలాంటి వారికి" అన్నాను.

శంకరం గలగలా నవ్వాడు. "మేవంతా ఊరికి ఉపకారులం సార్" అనీ అన్నాడు.

నేను రాజేశంని పరిచయం చేశాను. మాట వరసకి - అతనింత క్రితం సంతానం గురించి చెప్పిన అభిప్రాయాన్నీ వినిపించాను.

ఎక్కువమంది సంతానం ఎందుకోసం కావాలి? కిందటి తరాల్లోలాగా మానవ సంబంధాలు దృఢంగా వుండటానికా? అలా వుండే అవకాశం వుందా? మనిషి తనానికీ, మంచితనానికీ, అంకెలకీ మధ్య సంబంధం వుందా? ఉంటే ఈ నాటి మనుషుల్లో ఈ లెక్కలన్నీ ఎందుకు తప్పుతున్నయ్.

శంకరం మళ్ళీ నవ్వాడు. ఈ సారి రాళ్ళ మధ్యగా సాగుతున్న నీటి జాలులా. "మాకు ఇట్టాంటి విచికిత్సలు కలగవు సారూ. ఇది మంచా, అది చెడ్డా - అని తల పట్టుకోవటమూ తెలీదు. బహుశా మానాన్న స్కూల్ మాష్టర్ వారసత్వ మహిమేమో! అది కావాలనీ, ఇది రాలేదనీ జుట్టు పీక్కుంటూ కూచుంటే ఒరిగేదేం వుంది సారూ. అయినా రాజకీయాల్ని చూసి బొందలో పడేవారెందరు సారూ! మనిషి తానేం చేయదలచుకున్నాడో అదే చేస్తాడు"

నేనూ, రాజేశమూ కూడా శంకరం వైపు విస్తుపోయి చూస్తూ నిశ్శబ్దమైపోయాం.

జనం అంతా వెళ్ళిపోయారు. ప్రాంగణం బోసిగా వుంది. "రండి నరేంద్రగారూ వెళ్దాం" అని పక్కనున్న స్కూటర్ స్టాండ్ తీశాడు శంకరం. మళ్ళీ కలుద్దామని చెప్పకుని విడిబడ్డాము - నేనూ రాజేశమూ!

స్కూటర్ పోతుంది. చలి గాలి రివ్వున చెవుల్ని దబాయిస్తోంది. శంకరం మౌనంగా వేగాన్ని పెంచాడు.

నా మనసులోపల చాలా ఆలోచనలు కలగాపులగంగా సుడి తిరగసాగేయి. ఎక్కువమంది సంతానం ఎందుకోసం కావాలి? కిందటి తరాల్లోలాగా మానవ సంబంధాలు దృఢంగా వుండటానికా? అలా వుండే అవకాశం వుందా? మనిషి తనానికీ, మంచితనానికీ, అంకెలకీ మధ్య సంబంధం వుందా? ఉంటే ఈ నాటి మనుషుల్లో ఈ లెక్కలన్నీ ఎందుకు తప్పుతున్నయ్.

హఠాత్తుగా నా కళ్ళముందు నా నలుగురు సంతానం రూపాలు కనిపించాయి. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. నలుగురూ ఈనాడు 'వెలాఫ్!'

మరి నేనూ, మా యావిడా అక్కడా ఇక్కాడా వంటలు చేసుకుని వార్ధక్యాన్ని ఈడవాల్సి వస్తున్నదేం?! ఒక్క కొడుకు వున్న రాజేశం పరిస్థితికీ, నలుగురున్న నా పరిస్థితికీ తేడా ఏముందీ?

"దిగండి సారూ" అన్న అన్న శంకరం హెచ్చరికతో ఈ లోకంలో కొచ్చాను. ఎదురుగా మా ఇల్లు. బండి దిగాను. 'వస్తా మరి' అంటూ వెళ్ళిపోయాడు శంకరం.



- శాంత ఎదురు చూస్తోంది.

టిఫెన్ పెడుతూ నిదానంగా, అన్యమనస్కంగా చెప్పింది "అల్లుడు రామనాథం ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నాట్ట. సరస్వతి చెప్పింది"

తలెత్తి ఆశ్చర్యంగా ఆమెవైపు చూశాను.

"అవును. ఉన్న ఒక్క కూతుర్ని సరిగా సాకి, సాగనంపితే చాల్లే - అన్నాట్ట"

రైతు - కరువూ, బతుకు బరువూ - నా కళ్ళ ముందు మెదిలాయి. శంకరం మాటలు చెవుల్లో మార్మోగినై. 'రాజకీయాల్ని చూసి బొందలో పడినవాడెవరు సారూ. మనిషి తానేం చేయదలుచుకున్నాడో అదే చేస్తాడు'. మనిషి బొమ్మా చీకటి నాణెం కూడా నా కట్టెదుట నిలిచి భయపెడుతున్నై!

- విహారి, 9848025600

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

■ అలనాటి రచన

భావార్ణవము

నెల్లుట్ల రామకృష్ణామాత్య దేశపాండ్య చేసిన రచన భావార్ణవము. ఇది తిరుపతి వేంకటకవులు రచించిన గుంటూరు సీమకు బదులుగా వ్రాసిన రచన. గుంటూరు సీమ కొప్పరపు కవులను తిడుతూ వ్రాసింది. భావార్ణవము గ్రంథం పుట్టడానికి కారణం దోసమటం చెటింగియును దుందుడు కొప్పగ(బెంచినారమీ మీసము అన్న పద్యం కారణం. ఈ వివాదం వైదిక,నియోగి భేదాలను సృష్టించి పెద్ద వివాదంగా మారింది. భావార్ణవం ప్రథమతరంగంలో వైదికులంతా తిరుపతి వేంకటకవుల పక్షమైనా నియోగులంతా కొప్పరపు కవుల పక్షం అని అనడం సరికాదని చెప్పారు. తొలిభాగంలో శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిని ప్రశంసించారు కానీ ఏమీ అనలేదు. అయితే నెల్లుట్ల రామకృష్ణామాత్య వైదికులందరిని దృష్టి లో పెట్టుకుని ఏవేవో రాసారన్న భావంతో శ్రీపాద కృష్ణమూర్తి ఉన్నారు. భావార్ణవము నియోగిజాతి పక్షం నుండి వచ్చింది.



రెండవ తరంగంలో ప్రధానంగా శ్రీపాదవారు వ్యక్తి గతంగా చేసిన దూషణలకు సమాధానం వంటిదే. నియోగిజాతి కవిత్వాన్ని అంతటినీ కలిపి చెప్పకుండా నెల్లుట్ల వారినే ప్రత్యేకంగా చెప్పడం ఈ ద్వితీయ తరంగలక్ష్యం. మొదటి భాగానికి దేవులపల్లి రామానుజరావు, రెండవ భాగానికి దేవులపల్లి వేంకటేశ్వర రావు పీఠికలు వ్రాశారు. దేవులపల్లి రామానుజరావుగారు సాహిత్యవివాదాలు వ్యక్తిగతం కావడం మంచిది కాదని చెపితే, దేవులపల్లి వేంకటేశ్వరరావు భావార్ణవము పుట్టడానికి కారణం చెప్పారు.

అఖిల నియోగి వల్లభులకు అని వ్రాసుకున్నముందుమాట లో నెల్లుట్ల వారు తిరుపతివేంకటకవులు గుంటూరు అవధానంలో చేసిన పనిని నిరసిస్తూ నిదేశ ముఖ్గా వారి జాతి ఔన్నత్యాన్ని చెప్పుకున్నారు. మొదటిభాగంలో 377పద్యాలతో బాటు అపూర్వకవి సమ్మేళనము మొల్ల, నన్నయ, భారతి, చేమకూర, కొప్పరపుకవులు కవి సమ్మేళనం పాల్గొని తమ అభిప్రాయాలను చెప్పినట్లు చిత్రించారు. రెండవ భాగంలో 311 పద్యాలతో బాటు ఇది కలము దెబ్బ పేరుతో 95 పద్యాలు వ్రాస్తూ చివరికిౘ్రాసెదను నేను వేయి తరంగములన్నుఅని ప్రత్ఞి చేశారు.

భావార్ణవము రెండు భాగాలు వివాదకావ్యం,మరోవిధంగా చెబితే వివాద విమర్శకావ్యం. వ్యక్తిగత దూషణలను పక్కకు పెడితే అక్కడక్కడ కవిత్వ గుణాలను గురించి తన అభిప్రాయాలను చెప్పడం కనిపిస్తుంది. నియోగి వైదికకవుల గొడవలో తెలంగాణప్రాంతం కూడా ఏ రీతిలో పాల్గొన్నదో చెప్పే రచన భావార్ణవము. మొదటిభాగం 1944లో రెండవభాగం 1945లో వచ్చాయి.

- సిహెచ్.లక్ష్మణచక్రవర్తి, 9849714261









ఎగతాళి వద్దు



మగధ రాజ్యాన్ని సమర సింహుడనే పాలించేవాడు. ఆయన అందరినీ వెక్కిరించేవాడు. సరదగా ఏడిపించేవాడు. ఆయన కొలువులో విజయవర్మ అనే మంత్రివుండేవారు. విజయవర్మని వెక్కిరించానుకున్నాడు రాజు. ఇందుకోసం ఆయన ఒక దానిమ్మపండుకు జిగురు పూసి ఒక పాత్రలో పెట్టాడు.

విజయవర్మ దేని గురించో చెప్పటానికి రాజు దగ్గరికి వచ్చాడు. వచ్చిన పని పూర్తయ్యాక రాజు పాత్ర చూపించి 'విజయవర్మా! ఆ పాత్రలోని పండుని తీసి ఇవ్వు" అన్నాడు. విజయవర్మ ఆ పండును పాత్ర నుండి తీయబోతే అది అతుక్కుని రాలేదు. దీంతో రాజు పెద్దపెట్టున నవ్వి "ఏం విజయవర్మా... దానిమ్మ పండునే తీయలేకపోతున్నావు. ఇక నీ మంత్రి బాధ్యతని ఎలా నెరవేరుస్తావు?' అంటూ వెక్కిరించాడు.

విజయవర్మ సిగ్గుపడి తల వంచుకున్నాడు. రాజుగారికి ఉన్న ఎగతాళి చేయడమనే చెడ్డ సరదాని ఎలాగైనా వదిలించాలనుకున్నాడు కూడా.

ఒకసారి రాజు వేటకు వెళ్ళాడు. ఆ రోజు విజయవర్మ తనకు ఒంట్లో నలతగా వుందని చెప్పి రాజుకు వేటకు వెళ్ళలేదు. రాజు మృగాలను వేటాడుతూ అడవి మధ్యలోకి వెళ్ళాడు. సేవకులు ఆయన్ను అందుకోలేకపోయారు. చీకటి పడింది. తిరిగి వెళ్ళాలంటే రాజుకు దారి తెలీలేదు. అసలే దట్టమైన అడవి, పైగా చీకటి పడింది. హఠాత్తుగా రాజుకు పెద్ద నవ్వు వినిపించింది. రాజు గుండె జల్లుమంది. 'ఎవరిది?' అన్నాడు కొంచెం భయంగా బిగదీసుకుపోయి. బదులుగా 'నేను భూతాన్ని. చాలా రోజులుగా ఆహారం దొరక్క బాగా ఆకలిగా వున్నాను. నిన్ను తినేస్తాను' అంటూ ఇంకాస్త పెద్దగా నవ్వింది.

'దయచేసి నన్ను వదిలెయ్' అని వేడుకున్నాడు రాజు. 'వీల్లేదు' అంది భూతం.

రాజు మళ్ళీ మళ్ళీ బతిమిలాడడంతో 'సరే, నా చెప్పును నీ తలపై మోసుకుంటూ నీ కుడి చేతివైపు అర మైలు దూరం నడిస్తే వదిలేస్తాను' అంది భూతం.

'సరే' అన్నాడు రాజు. వెంటనే ఒక పెద్ద చెప్పు వచ్చి అతని ముందు పడింది. దాన్ని తలపై పెట్టుకుని అతని కుడి చేతివైపు అరమైలు దూరం నడిచాడు. అక్కడ అతని సేవకులు కనిపించడంతో బ్రతుకు జీవుడా అని అక్కడి నుండి బయటపడ్డాడు.

తర్వాతి రోజు సభలో రాజు విజయవర్మని "ఏం విజయవర్మా... దానిమ్మ పండుని పాత్ర నుండి ఈ రోజైనా తీస్తున్నావా లేదా? అని ప్రశ్నించాడు నవ్వుతూ. దానికి విజయవర్మ 'ప్రభూ! దానిమ్మ పండును తీయలేకపోయాను కానీ, భూతం చెప్పును తీసుకురాగలిగాను' అన్నాడు. దాంతో రాజు ముఖం చిన్నబోయి కిమ్మనలేదు. వీరిద్దరి మాటలు అక్కడున్నవారికి అర్థం కాక ప్రశ్నార్థకంగా చూడసాగారు. దానికి రాజు అప్పటికి ఏదో సర్ది చెప్పి, ఆ తర్వాత మరెప్పుడూ ఎవ్వరినీ వెక్కిరించలేదు.



వేట మొదలు

ఈ గాడిదని వేటాడ్డానికి ఓ పులి నక్కి కూర్చుంది. కనిపించిందా?

దారేది?

ఈ బుల్లి టాయ్ ట్రైన్ ఇక్కడున్న ఊదు ప్రాంతాలను తాకుతూ వెళ్ళాలి. ఎలాగో చెప్పండి.



యల్ల

భారతదేశానికి చెందిన
సుబ్బారావు. ఈయన జన
జీవించారు. హార్వర్డ్ స్కూల్
లెడ్రలే ప్రయోగశాలలో
రూపొందించిన హెట్రజాన్
నివారణకు ఉపయోగించబ
పూర్తిగా నిర్మూలింపగల మ
డుగ్గర్ 1945లో ప్రపం
ఆరియోమైసిన్ కనుగొన్నార
చూడనీయకపోవడంతో ఆ
కనుగొన్నారు. కొత్తగా కనుగొ
పెట్టారు. 1947లో అమెరికా

...ీక



అతికిద్దాం

పక్కనున్న మూడు ముక్కలు ఈ బొమ్మలోనివే. వాటిని ఎక్కడ అతికిస్తే సరిగ్గా సరిపోతుందో చూసి అతికించేయండి.

రంగులతో...

...ప్రగడ సుబ్బారావు

...ద్య శాస్త్రజ్ఞులలో చాలా ప్రసిద్ధి చెందిన వ్యక్తి యల్లాప్రగడ
...ి 12, 1895- ఆగస్టు 9, 1948 మధ్య కాలంలో
...ఫ్ ట్రాపికల్ మెడిసిన్ నుండి డిప్లొమా పొందిన తర్వాత
...ిక్ ఆమ్లం నిజస్వరూపాన్ని కనుగొన్నారు. ఈయన
... అనే మందు ప్రపంచ ఆరోగ్య సంస్థచే బోధకాలు
...ంది. ఇంకా టైఫాయిడ్, పాండురోగం వంటి వ్యాధులను
...ులను కనుగొన్నాడు. ఈయన పర్యవేక్షణలో బెంజిమన్
...ంలోనే మొదటి టెట్రాసైక్లిన్ యాంటీ బయాటిక్
... పెస్క్ అనే వ్యక్తి అసూయతో సుబ్బారావు కనుగొన్న పరిశోధనలను వెలుగు
...న కనుగొన్న న్యూక్లియోటైడ్లను కొన్ని సంవత్సరాల దీన్నే ఇతర పరిశోధకులు
... శిలీంద్రానికి (ఫంగస్) సుబ్బారావు గౌరవార్థం 'సుబ్బారోమైసిస్ స్ప్లెండెన్స్' అని పేరు
...ౌరసత్వం లభించినా ఈయన భారత పౌరుడిగానే మిగిలిపోయారు.



ఎన్ని ఉపయోగాలో...

➡ ప్రపంచంలో గొర్రెల సంఖ్య ఒక బిలియన్ దాకా వుంటుంది.

➡ మిగతా దేశాలకంటే చైనాలో వీటి సంఖ్య ఎక్కువ.

➡ ఇవి 360 డిగ్రీల కోణంలో వున్నవి కూడా చూడగలవు. అంటే తల తిప్పకుండానే వెనక వున్నవి కూడా చూస్తాయి.

➡ ఇవి గడ్డిలాంటి శాఖాహారాన్ని మాత్రమే తింటాయి.

➡ ఇది తిన్న ఆహారం నాలుగు గదులున్న జీర్ణవ్యవస్థలో జీర్ణమవుతుంది.

➡ గొర్రెలు దేన్నైనా చూసినప్పుడు దాన్ని రెండేళ్ళ వరకు గుర్తుపెట్టుకోగలవు. అలా 50 రకాలను జ్ఞాపకముంచుకోగలవు. ఇవి మనుషులను కూడా గుర్తు పడతాయి.

➡ గొర్రె పేగుల నుండే టెన్నిస్ రాకెట్లకు కట్టే దారాలు తయారు చేస్తారు.

➡ సబ్బులు, కొవ్వొత్తులు తయారీలో వీటి కొవ్వును ఉపయోగిస్తారు.

➡ గొర్రె శరీరం మీద వుండే నూలు నుండి వస్త్రాలను తయారు చేయడం క్రీ.పూ. 10 వేల సంవత్సరాల ముందు నుండే ప్రారంభమైంది.

➡ సంవత్సరానికి 30 పౌండ్ల వరకు ఊలును ఉత్పత్తి చేస్తుంది.

➡ చూడ్డానికి గొర్రెలు, మేకలు ఒకేలా కనిపిస్తాయి కానీ వాటి క్రోమోజోముల్లో తేడా ఉంటుంది. గొర్రెకు 54 క్రోమోజోములుంటే, మేకకు 60 క్రోమోజోములుంటాయి.

➡ గొర్రె పాలనుండి జున్ను ఎక్కువగా తయారు చేస్తారు. వీటి పాలలో కాల్షియం, ఎ,బి,ఇ విటమిన్లు అధికంగా ఉంటాయి.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

పారిస్, 1849

జూన్ 9 నాడు, వేసవి ఎండగాడ్పులలో, కలరా మహమ్మారి వుధృతంగా వున్నప్పుడు పారిస్ చేరుకున్నాడు మార్క్స్. ఇప్పుడు ప్రభుత్వంలో మిత్రులెవరూ లేరు గనక, ఇబ్బందులు రాకుండా వుండాలని మెస్యూర్ రాంబోజ్ అనబడే మారుపేరుతో ప్రయాణం చేశాడు. విప్లవమూ, ప్రతీఘాత విప్లవమూ ఇక్కడ కూడా దర్శనమిచ్చింది. సొంత ప్రయోజనాలు వచ్చేసరికి మధ్యతరగతి, బూర్జువావర్గం, ధనవంతులు, కార్మిక వర్గానికి ద్రోహం చేస్తున్నారు. కార్మిక వర్గ ప్రయోజనాలు వాళ్లకు పట్టవు. దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నమూ చేయ్యరు. ఈ 'చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష' గాళ్ల మీద అసహ్యామేసింది. కాని వున్నత వర్గాల వాళ్లను ఎదిరించటానికి కార్మికులు కూడా సంఘటితం కావటం లేదు. ఇది అసలైన విషాదం అయినా, "ఉద్యోగాల మీద భరోసా లేని నలభై లక్షల మంచి ఫ్రెంచి కార్మికులు" మీద ఇంకా నమ్మకం సడలలేదు. ఎప్పుడో ఒకప్పుడు వీళ్లు తిరగబడతారు. "పారిస్ విసుగెత్తిస్తున్నది. ఇవిగాక కలరా. అయినా, విప్లవ జ్వాలాముఖి పారిస్‌లో బద్దలు కావటం తథ్యం. విప్లవ పార్టీతోనే నా పయనం...."

జెన్నీ మళ్లీ గర్భవతి. జర్మన్ ప్రభుత్వ సైనిక పాలన నుండి పారిస్‌కు రావటం ఆమె సంతోషాన్ని రెట్టింపు చేసింది. లూయీ నెపోలియన్ రియాక్షనరీ కావచ్చుగాని ఇక్కడి జీవితంలో స్వేచ్ఛ వుంది. ఈ నగరమంటే ఆమెకు ప్రేమ.

జూన్ 13 నాడు మార్క్స్ ఆశించినట్టే జరిగింది. పోప్‌ను రక్షించటానికి రోమ్‌కు సైన్యాన్ని పంపించాడు ఫ్రెంచి ప్రభువు లూయీ నెపోలియన్. ఇలా చెయ్యటం వల్ల ఫ్రాన్సులోని రోమన్ కాథలిక్కులు తనను సమర్థిస్తారని ఆయన నమ్మకం. నేషనల్ అసెంబ్లీలో అల్పసంఖ్యాక లిబరల్ ప్రతినిధి లెడ్రూ రాలిన్ ఈ చర్యను వ్యతిరేకించాడు. దాడి చేసినందుకు లూయీ నెపోలియన్‌ను అభిశంసించాలని తీర్మానం ప్రతిపాదించాడు. కానీ, అసెంబ్లీ తన ప్రతిపాదనను తిరస్కరించడంతో తిరగబడమని తన సమర్థకులకు పిలుపునిచ్చాడు. రాజకీయ వాతావరణం, 1848లో మాదిరి అంత ఉద్రిక్తంగా లేదిప్పుడు. నిరసనకారులు ఒక స్కూలును స్వాధీనం చేసుకుని బారికేడ్లు కట్టటానికి ప్రయత్నించారు. కాని, "వీధుల్లో అక్కడక్కడా కొన్ని విరిగిపోయిన కుర్చీలు తప్ప మరేమీ కన్పించలేదు" అన్నాడు మార్క్స్. ఇది విప్లవం నిర్వీర్యమైన విషయం స్పష్టం చేసింది. తిరుగుబాట్లను అణచడంలో లూయీ నెపోలియన్ పట్టు సాధించాడు. ప్రభుత్వం పారిస్ 'ముట్టడి'లో కొనసాగుతున్నట్టుగా ప్రకటించింది. శరణార్థులమీద కొత్త ఆంక్షలు పెట్టారు. అన్నింటికన్నా ముఖ్యంగా, పారిస్ మరోసారి, ప్రజలను రెచ్చగొట్టే విదేశీ మూకలకు ఆశ్రయమివ్వకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంది ప్రభుత్వం. జర్మన్‌ల మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టారు పోలీసులు. అంతర్జాతీయ విప్లవ కమిటీ నాయకులు వీళ్లేనని వాళ్ల నమ్మకం. "ఇది కేవలం వాళ్ల ఊహ.. ఇన్ని మాటల వెనుక వాళ్ల దృష్టిలో వున్నది మార్క్స్ ఒక్కడే" అన్నాడో చరిత్రకారుడు.

జూలై 7 నాటికి జెన్నీ, లెంచెన్, పిల్లలు కూడా పారిస్‌కు చేరుకున్నారు. జెన్నీ మళ్లీ గర్భవతి. జర్మన్ ప్రభుత్వ సైనిక పాలన నుండి పారిస్‌కు రావటం ఆమె సంతోషాన్ని రెట్టింపు చేసింది. లూయీ నెపోలియన్ రియాక్షనరీ కావచ్చుగాని ఇక్కడి జీవితంలో స్వేచ్ఛ వుంది. ఈ నగరమంటే ఆమెకు ప్రేమ. ఇక్కడే ఉండిపోవాలని కలలు కన్నది. నవవధువుగా ఈ నేల మీద కాలు మోపింది. తన ఇష్టానికి వ్యతిరేకంగా నగరం వీడాల్సివచ్చింది. ఇప్పుడు వాళ్ల నివాసం, హైన్ ఇంటికి సమీపంలోనే వుంది. ఇంట్లో ఫర్నిచర్, చిన్న తోట కూడా వుంది.

జెన్నీకి ఉల్లాసంగానే వుందిగాని, "సంసారం గడిచేదేలా?" డబ్బులు పంపమని తెలిసిన వాళ్లందరికీ ఉత్తరాలు రాస్తున్నారు మార్క్స్. అయితే దుర్వార్త లేవీ ఆమె చెవిన పడకుండా జాగ్రత్తపడ్డాడు. రోజు గడవలేని పరిస్థితి దాపురించిందని ఆమెకు తెలియదు. కొలోన్‌లో వున్నప్పుడే, ఆస్తిలో వచ్చిన తన వాటాను పత్రిక కోసం ఖర్చు చేశాడు. భార్య నగలన్నీ తాకట్టు పెట్టేశాడు. జేబులో పైసా లేదు. బేడెన్‌లో తిరుగుబాటుదారులతో కలిసి పోరాటం చేస్తున్న ఎంగెల్స్‌కు రాశాడు. "డబ్బు కోసం ప్రయత్నించు. ఆర్థిక సమస్యల్లో కూరుకుపోవటానికిది సమయం కాదు" చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి.

అయితే, డబ్బుకున్న తీవ్రమైన సమస్య మరొకటి రాబోతున్నది. తను ఈ నగరంలో చాలా సంతోషంగా వున్నానని జెన్నీ తన మిత్రురాలికి రాసిన అయిదు రోజులకే ఎరవో తలుపు తట్టారు. ఎదురుగా పోలీసుమనిషి. దంపతులు ఇరవై నాలుగు గంటల్లో పారిస్ వదిలి వెళ్లిపోవాలని ఆదేశం. జెన్నీకి పారిస్ కలచెదిరింది. "మార్క్స్ అవాంఛనీయ వ్యక్తి. ఫ్రెంచి రాజధానిలో ఉండదగిన వాడు కాదు" అదీ ఉత్తర్వు. తాను రాజకీయాలు చేయటం లేదనీ, కేవలం ఒక ఆర్థిక శాస్త్ర గ్రంథ రచన మీద ఉన్నానని చెప్పాడు మార్క్స్. కాని అతడి ప్రమాదకర కార్యకలాపాల గురించి వీళ్ల దగ్గర ఆధారాలున్నాయి.

బహిష్కరణ ఆదేశం ప్రకారం, పారిస్‌కు మూడువందల మైళ్ల దూరాన హెర్బిహాన్ నగరానికి వెళ్లొచ్చు మార్క్స్. కాని అక్కడికి వెళ్లడమంటే మరణ శిక్షణతో సమానం. అక్కడి చిత్తడి నేల రోగాలకు పుట్టిల్లు. ఈ అర్జీ పెట్టుకుంటే, నెలరోజుల గడువు పెంచింది ప్రభుత్వం. కానీ, తలపైన ఖడ్గం వెలాడుతూనే ఉంది. రోజులు ప్రశాంతంగా గడవలేదు. ఈ సమస్య చాలదన్నట్టు జెన్నీ, పిల్లలు జబ్బుపడ్డారు. మార్క్స్ స్వయంగా అందరికీ సేవ చేశాడు. 'జెన్నీకి గర్భం వల్ల వచ్చిన నలత' అన్నాడు మార్క్స్. కాని ఆమె దిగులు పెంచుకోవటం వల్ల జబ్బుపడి వుండే అవకాశముంది. నాలుగేళ్లలో నాలుగు దేశాలు మారింది. వ్యక్తిగత సమస్యలు పెరిగినప్పుడు అనారోగ్యంపాలు కావటం ఆమె స్వభావం. ఇంటి ఇల్లాలు కదల్లేని స్థితిలో వుంది గనుక బాధ్యతంతా లెంచెన్ మీద పడింది.

కాని మార్క్స్, తన రచనావ్యాసంగాన్నీ, పార్టీ కార్యకలాపాల్నీ వ్యక్తిగత విషాదాలకు ఒక కవచంలాగా వాడుకున్నాడు. కర్తవ్యానికీ, వ్యక్తిగత జీవితానికీ తేడా పాటించాడు ("సమస్యలున్నాయని బాధపడుతూ కూర్చోవటమంటే–అదొక బూర్జువా వ్యసనం. యుద్ధ సమయంలో ఇది క్షమించరాని నేరం" అన్నాడట మార్క్స్). ఫ్రైల్‌గ్రాత్‌కు రాసిన ఒక లేఖలో "సొంత సమస్యల్ని మరచిపోవటానికి రాజకీయాలు మాట్లాడుకుందాం" అంటాడు. ఇన్ని సమస్యలతో కొట్టు మిట్టాడుతూ జేబులో పైసాలేదు, వస్తుందనే ఆశ కూడా లేని రోజుల్లో "చాలా సమస్యలున్నాయి. రేపు ఎలా గడుస్తుందో తెలియదు. అయినా తృప్తిగానే వున్నాను. అంతా బాగానే వుంది" అంటూ తన మిత్రుడు వైడెమియర్‌కు లేఖ

రాశాడు. 'గత సంవత్సరం కార్మికులను ఓడించిన వాళ్ల వ్యక్తిగత ప్రయోజనాల వైరుధ్యాలతో తగువులాడుకుంటున్నారు. పరిణామాలు త్వరలో చూడొచ్చు' అనుకున్నాడు మార్క్స్.

కుటుంబ పోషణ కోసం, ఎలాగైనా, ఎంతో కొంత సంపాదించటానికి చాలా ప్లాన్లు వేసుకున్నాడు. ఆర్థిక సమస్యల మీద కరపత్రాలు ప్రచురించటం నుండి, బెర్లిన్‌లో మరో వార్తా పత్రిక ప్రారంభించటం దాకా. ఇప్పటికే పుస్తకం రాసిస్తానని, అడ్వాన్సు తీసుకుని తిరిగి చెల్లించని మార్క్స్, తన పబ్లిషర్ లెస్కెను మరో పుస్తకం కోసం సంప్రదించాడు. కాని అనుకున్నదేదీ జరగలేదు. డబ్బు పుట్టలేదు, ఆగస్టులో, మార్క్స్ అర్జీని తిరస్కరించిన ప్రభుత్వం తక్షణం మోర్బిహాన్ కన్నా వెళ్లాలి. లేదా దేశం విడిచి వెళ్లాలంది. కొలోన్ నుండి ఇక్కడికి వచ్చినప్పుడే పరిస్థితి దారుణంగా వుందనుకుంటే ఇప్పుడది మరింత దిగజారింది.

ఇక నిస్పృహలో, తోటి సోషలిస్టు ఫెర్డినాండ్ లసాల్‌కు రాశాడు, "దేశం విడిచిపోవటానికైనా ఎంతో కొంత కావాలి". ఈ విషయం రహస్యంగా వుంచమని లసాల్‌ను కోరాడు. కాని, మార్క్స్ ఆర్థిక పరిస్థితి గురించి అందరికీ చెప్పాడు లసాల్. మార్క్స్‌కు కోపం వచ్చింది. ఇది తన శత్రువుల చేతికి ఆయుధం అందించినట్టుగా వుంటుంది. తన వ్యక్తిగత సమస్యలు ఇతర్లకు తెలియటం మార్క్స్‌కు ఇష్టం వుండదు. "పబ్లిగ్గా ముష్టెత్తుకోవటం కన్నా ఆకలితో మాడటం మేలు". అని రాశాడో మిత్రునికి. కాని పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. లసాల్ మీద ఎంతకోపమున్నా. ఆయన పంపిన డబ్బు తీసుకున్నాడు. అంతకన్నా చెయ్యగలిగింది కూడా ఏమీ లేదు.

స్విట్జర్లాండు పోవటానికి పాస్‌పోర్టు ఇవ్వమని అడిగాడు మార్క్స్ . కాని అధికారులు నిరాకరించి ఇంగ్లండుకు మాత్రమే ఇస్తామన్నారు. అదీ ఫ్రెంచి ప్రభుత్వం వైఖరి. అప్పటికే స్విట్జర్లాండులో వున్న ఎంగెల్స్‌కు ఉత్తరం రాసి, తాను ఇంగ్లండుకు బయల్దేరుతున్నాననీ, జెన్నీ మాత్రం కొన్ని వ్యవహారాలు పూర్తి చేయటానికి మరి కొన్నాళ్ళ ఫ్రాన్సులోనే వుంటుందనీ చెప్పాడు మార్క్స్. అక్కడికి వెళ్లిన తర్వాత ఒక జర్మన్ పత్రిక ప్రారంభించటానికి కొందరు ఆర్థిక సహాయం చేస్తామన్నారనీ, వెంటనే వచ్చి తనను లండన్‌లో కలుసుకోవాలసిందని కూడా కోరాడు. "నువ్వు స్విట్జర్లండులో వుండటానికి వీల్లేదు. లండన్‌లో మనం తక్షణం పని ప్రారంభిద్దాం. నన్ను ఒంటరిగా వదలవని గట్టిగా నమ్ముతున్నాను".

ఆగస్టు 26 నాడు ఇంగ్లీషు చానెల్ దాటాడు మార్క్స్. మరో రెండు వారాలపాటు జెన్నీ, లెంచెన్, పిల్లలు పారిస్‌లోనే వున్నారు. మొదటి సారి ఒంటరిగా వున్నప్పుడు, తమ పరిస్థితిలోనే వున్న అనేకమంది మిత్రులు మధ్య థ్రిల్లింగ్‌గా అనిపించింది గాని, ఎప్పుడేమవుతుందోనని భయంతో వణికిపోయింది జెన్నీ. ఇప్పుడామె ఏడు నెలల గర్భవతి. పారిస్ వేడిలో కదలటం ఇబ్బందిగా వుంది. సహాయం చెయ్యటానికి మిత్రులుకూడా ఎక్కువగా లేరు. హైన్ వున్నాడు గాని ఆరోగ్యం బాగా క్షీణించింది. ఇంచుమించు జీవచ్ఛవంలా పడివుంటున్నాడు. పక్షవాతం వచ్చింది. బాధ ఉపశమనానికి మార్ఫైన్ తీసుకుంటున్నాడు. నోరు సరిగ్గా పలకలేక పోయినా, గుసగుసగా కవిత్వం డిక్టేట్ చేస్తున్నాడు. ఒకప్పుడు జెన్నీ చెన్ ప్రాణాలు రక్షించిన మనిషి యిప్పుడు కదలలేని స్థితిలో వున్నాడు.

కొద్ది రోజుల క్రితమే జెన్నీ కన్న పారిస్ కలలు చెదిరిపోయాయి. ఎప్పుడో చలిగా, తేమగా వుండే ఇంగ్లండు కెళ్లాలి. ఆదేశం గురించి ఏమీ తెలియదు. ఫ్రైల్‌గ్రాత్ ఇచ్చిన వంద ఫ్రాంకులతో తానూ, లెంచెన్, ముగ్గురు పిల్లలు (ఇప్పుడు వాళ్ల వయసు 5,3,2) కాలేకు వెళ్లి, సెప్టెంబర్ 15 నాడు ఇంగ్లండుకు స్టీమర్‌లో ప్రయాణమయ్యారు. "కత్తితో, కలంతో పేదల, పీడితుల రాజ్యం కోసం పోరాడిన పురుషులకు అక్కడ భుక్తి దొరుకుతుంది" అంది జెన్నీ. కాని, ఆరు సంవత్సరాల అనిశ్చితి తర్వాత, ఆమె ఇంగ్లండు వెళ్లి కేవలం విశ్రాంతి తీసుకోవాలని కోరుకున్నది.

ఇంగ్లండులో దేశాంతర వాసం

లండన్, 1849

లండన్ లాగే వుంటుంది నరకం....
న్యాయం, కరుణ కనిపించవక్కడ.
పెర్సీ బిష్ షెల్లీ.

1849లో, చానెల్‌లో రెండురోజుల ప్రయాణమంటే ఎవరికైనా కష్టమే కాని జెన్నీకి ప్రాణం మీదికి వచ్చినంత పనైంది. ముప్పై అయిదేళ్ల వయసు. ఏడు నెలల గర్భం. మే నుండీ వున్న చోటు ఉండకుండా ప్రయాణాలు చేస్తునే వుంది. నీళ్లలో తడిసి ముద్దై, చలిలో, సీ సిక్‌నెస్‌తో, తనలాగే తడిసిన పిల్లలతో కనీసం ఇన్ని కష్టాల తర్వాతనైనా భర్తను చూడవచ్చుననే ఆశతో లండన్ చేరింది. కాని, స్టీమర్ దిగగానే మార్క్స్ కనిపించలేదు. కలరా వంటి జబ్బుతో మంచంపట్టి, కదలలేని స్థితిలో, తన కవి మిత్రుడు జార్జివీర్త్‌ను, భార్యాపిల్లల్ని తీసుకురమ్మని పంపించాడు. అలా, అతడే వాళ్లకు తొలిసారి లండన్‌ను పరిచయం చేశాడు. అంతా కొత్తగా వుంది. పొగమంచులో నెమ్మదిగా కదిలిన గుర్రపుబండీ, ఒక జర్మన్ దర్జీ, లెస్టర్ స్క్వేర్‌లో నిర్వహిస్తున్న బోర్డింగ్ హౌజ్ ముందుకు వచ్చి ఆగింది. మార్క్స్ మరో మంచి ఇల్లు అద్దెకు తీసుకున్న దాకా వాళ్లంతా ఇక్కడే వుండాలి. అప్పటికి, అతడు గ్రాస్‌వెనర్ స్క్వేర్ కార్ల్ బ్లైండ్ అనబడే మిత్రుని వద్ద వుంటున్నాడు.

నెపోలియన్

బోర్డింగ్ హౌజ్‌లోని ఇరుకు గదిలో కూర్చున్న జెన్నీ నిరాశా నిస్పృహలను వూహించుకోవాల్సిందే. చలి కాచుకోవటానికి సరిపోయినంత బొగ్గు లేదు. భవిష్యత్తు ఎలా వుండబోతుందో తెలియదు. అద్భుతమైన, కాంతివంతమైన, సరదాలకు నిలయమైన పారిస్‌లో వుండే ప్రాప్తం తనకు లేదు. ఇదో వింత నగరం. ఇక్కడి భాషే తనకు అర్థం కాదు. అనూహ్యంగా జరుగుతున్న ఈ పరిణామాలు ఆమెకు మరింత బాధాకరం. పెద్ద, సంపన్న కుటుంబం నుండి వచ్చింది. ఇప్పుడేమో రోజూ డబ్బుకు కటకటే. యూరోపుకు ఓ చివరన విసిరేసినట్టుగా వుంటుంది ఇంగ్లండు. అన్ని దేశాలనుండీ వచ్చిన వేలాది మంది శరణార్థులకు నిలయం లండన్. రాజులు, రారాజులు, విప్లవకారులు, దుర్మార్గులు ఒక్కటేమిటి, తిరుగుబాట్లు చేసి పరాజితులై పలాయనం చిత్తగించిన వాళ్లూ, అణచివేతను భరించ లేక వచ్చిన వాళ్లూ అందరూ ఉన్నారిక్కడ. "ఐదుకోట్లు మందిని ఉక్కుపాదంతో పాలించిన నియంతనూ, అర్థాకలితో వచ్చిన పేదరాలినీ సమానంగా చూడగల శరణార్థుల నగరం లండన్" అన్నాడో రచయిత.

మార్క్స్‌కు మాంచెస్టర్‌లో కలిగిన అనుభవమే జెన్నీకి లండన్‌లో ఎదురైంది. అత్యంత సంపన్న నగరమిది. అత్యంత పారిశ్రామికీకరించబడిన నగరమిది. కాని ఇంతమందికి, దుర్గంధం, దుర్భర దారిద్ర్యం తానెక్కడా చూడలేదు. అయితే, ఆమె చూడలేదుగాని అక్కడ ధనికుల బస్తీలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు గ్రాస్‌వెనర్ స్క్వేర్, విలాస భవనాలుంటాయక్కడ. లోపల వెచ్చగా వుంటుంది. సిల్కుడ్రెస్సులలో సుందరీమణులు వయ్యారంగా నడుస్తారు. విశ్రమించటానికి మెత్తటి దిండ్లు, పరుపులు. ట్రేయర్‌లో ఆమెకు సుపరిచితమైన వాతావరణం లాంటిదే అది. సుఖజీవితానికి మారుపేరు. డబ్బులు లేకపోయినా, మర్యాదగా బతక గలిగిన బస్తీలు మరికొన్ని ఉన్నాయి. కాని లెస్టర్ స్క్వేర్ అదీకాదు. ఇదీకాదు. మర్యాదస్తులుండే చోటే కాదది. తెరవని జెన్నీ ట్రంకు పెట్టెల్లో పారిస్‌లో కొన్న సిల్కు డ్రస్సులు మడతపెట్టి వున్నాయి. ఆమె విజిటింగ్ కార్డు మీద బేరనెస్ వాన్ వెస్ట్ ఫాలెన్ అని రాసుంది. ఆ కులీనురాలు ఈ మురికి కూపానికి చేరుకుంది. ఇదేమి నగరం! ఇదేమి చోటు. ఆమె ఉఛ్వాస నిశ్వాసలలో నిరాశ!. *(సశేషం)*

సంచలన నవలాకారుడు

'బాలచంద్ర నెమాడే'కి జ్ఞానపీఠ పురస్కారం దక్కింది అనగానే నా మనసంతా 'హిందూ' వైపు పరుగెత్తింది. కానీ పురస్కారం 'కోస్లా'కి వచ్చింది. 'కోస్లా' నెమాడే తన 24 సంవత్సరాల వయసులో రాసిన మొదటి నవల. దానికి తన 76 సంవత్సరాల వయసులో ఆయన జ్ఞానపీఠం అందుకున్నారు.

'కోస్లా' ఇంగ్లీషుతో సహా 12 ఇతర భారతీయ భాషల్లోకి అనువాదం అయింది. ఇంగ్లీషులోకి 'కకూన్' పేరుతో అనువదించారు. కకూన్ అంటే పట్టు పురుగుల గూడు అని అర్థం. ఈ నవలంతా నెమాడే స్వంత అనుభవాలు, అనుభూతులతో నిండి వుంది. ఒక రకంగా ఇది నెమాడే ఆత్మ కథకి ఇంట్స్ లాంటిది.

సాత్పురా పర్వత శ్రేణులకి దగ్గరగా ఉన్న ఒక మారుమూల పల్లెటూరు నుండి పూణెకి ఉన్నత విద్యాభ్యాసం కోసం వచ్చిన 'పాండురంగ సంగ్వీకర్' అనుభవాల సారాంశం ఈ 'కోస్లా' నవల. గుజరాతీ, మరాఠీ భాషల సమ్మిశ్రితంగా ఏర్పడిన ఖాందేసీ మాండలికంలో మాట్లాడే పాండురంగ సంగ్వీకర్, వ్యవసాయ నేపథ్యం నుండి వచ్చాడు. 1960 ల నాటి యాంగ్జ్రి సిక్సిటీస్‌లో గ్రామీణ యువత ఎదుర్కొన్న అనేకానేక సంక్షోభ అస్తిత్వ సమస్యలకు అతడు ప్రతిరూపం.

వ్యవసాయ సమాజం నుండి వచ్చిన అతడు, పూణెలో ఎదురయిన ఆధునిక, ఆంగ్లిసైజ్డ్ సమాజంతో పాటు నడవలేక, ఆ పద్ధతులను జీర్ణించుకోలేక ఒడ్డున పడిన చేప పిల్లలా గిలగిలలాడిపోతాడు.

తన సమాజం పెంచి పోషించిన విలువలకి, తను ప్రవేశించిన సమాజం నిర్దేశించుకున్న విలువలకి నడుమ తలెత్తిన అంతరాన్ని సమన్వయం చేసుకోలేక మథనపడతాడు. నెమాడే ఈ సంఘర్షణని సాంస్కృతిక వెలితిగా పిలుస్తాడు. సాంస్కృతిక వెలితి మానవ జీవితాలను ఎలా విధ్వంసం చేస్తుందో ఈ నవల ప్రతిభావంతంగా ఆవిష్కరిస్తుంది. కోస్లా నవల చివరలో పరీక్ష హాల్ నుండి పాండురంగ సంగ్వీకర్ పారిపోయి తన ఇంటికి వెళ్లిపోతాడు. తను ఇక ఎప్పటికీ నేర్చుకోవడం అనే ప్రక్రియని కొనసాగించననీ, రెండు ప్రపంచాలని, రెండు సంస్కృతులను సమన్వయం చేయడం తన వల్ల కావటం లేదని వివరిస్తాడు.

ఉత్తర మహారాష్ట్ర ప్రాంతంలో మాట్లాడే స్వచ్ఛమయిన మాండలికంతో రాసిన ఈ నవల మరాఠీ నవలా స్వరూపాన్ని పూర్తిగా మార్చేసి సంచలనం సృష్టించింది. ఒక రకంగా 'నెమాడే స్కూల్ ఆఫ్ రైటింగ్' కి ఇది దారి వేసింది.

ఈ నవల చదువుతున్నంత సేపూ నాకు మన తెలుగు 'నవీన్' రాసిన 'అంపశయ్య' నవల గుర్తుకు వచ్చింది. అంపశయ్యలో కూడా 'రవి' అనే ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థి జీవితంలోని ఒక రోజు చైతన్య స్రవంతి పద్ధతిలో చిత్రితమయింది. ఆ తరువాత నవీన్ కాస్తా అంపశయ్య నవీన్‌గా మారిపోయి అంపశయ్యకి సీక్వెల్‌గా మరో రెండు నవలలు 'ముళ్ళపొదలు, అంత:స్రవంతి' రాశారు. అయితే నెమాడే 'కోస్లా'కి కొనసాగింపు రాసినట్టు లేదు.

'కోస్లా' తరువాత 1975లో నెమాడే 'బీదర్' అనే నవల రాశారు. తరువాత 'హూల్, జరీలియా, ఝూల్' అనే నవలాత్రయం రచించారు. 'దేశివార్' (నతివిశం) అనే విమర్శగ్రంథం నెమాడేకి బాగా పేరు తీసుకువచ్చింది. ఒక రకంగా దేశవాదీ నెమాడే తాత్విక ధారకి ఆలంబన.

ఇందులో ఆయన తన సాహిత్య పరమయిన ఆలోచనలు అన్నీ పంచుకున్నారు.

నెమాడే 'కోస్లా' నవల ఎంత సంచలనం సృష్టించిందో అంతకంటే ఎక్కువ సంచలనం సృష్టించింది 'హిందూ' నవల. దీన్ని ఆయన నాలుగు భాగాలుగా రాయాలి అనుకున్నారు. నేను మొదటి భాగం మాత్రమే చూశాను.

"హిందూ అనే భావనను నేను తిరిగి నిర్వచించాలి అనుకున్నాను. బుద్ధుడి తర్వాత బ్రాహ్మణికల్ పీరియడ్‌లో 'హిందూ' ఒక హైరార్కీ గా తయారయింది. రిజిడ్‌గా తయారయింది. ఒకప్పుడు హిందూ అంటే ఇండస్, సింధు నదికి ఆవలివైపు నివసించే ప్రజలు అని అర్థం" కానీ ఇప్పుడు హిందూ అనే పదం ఛాందసవాదుల చేతుల్లో పడి నేను హిందువును అని చెప్పుకోవడానికి సిగ్గుపడే పరిస్థితికి వచ్చింది.

నిజానికి హిందూయిజం అందర్నీ కలగలుపుకుని పోయే విశాల దృక్పథం కలిగినది. అది గదినీ, మదినీ తెర్చి అన్ని పవనాలను ఆహ్వానిస్తుంది. యజ్ఞోపవీతం ధరించి, శాకాహారి అయిన ఒక బ్రాహ్మణ సామాజిక వర్గానికి మాత్రమే హిందూ అనే పదాన్ని మీరు వర్తింపజేయడం సరి అయినదికాదు.

ఇతర మతాలని ద్వేషించడం, మరీ ముఖ్యంగా మహమ్మదీయ సమాజాన్ని ద్వేషించడం హిందూలో భాగం కాదు. హిందూ, ముస్లింల మధ్య ఒక తాత్విక సంబంధం వుంది. ఆ తాత్విక సంబంధంతోనే ఒక ప్రత్యేకమయిన సంస్కృతిని మనం అభివృద్ధి పరిచాము.

'గడియారంతో ముందుకు దూసుకెళ్ళిన పెండ్యులంను తిరిగి నేను వెనక్కు తీసుకుని రావాలి అనుకుంటున్నాను. ద్వేషానికి తావు లేని, వెలివేతకి తావులేని, హిందూ వైపు నేను సమాజాన్ని తీసుకుని రావాలి అనుకుంటున్నాను' అని 'హిందూ' మొదటి భాగం విడుదల అయిన సందర్భంగా 'ది హిందూ' దిన పత్రికకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు నెమాడే.

ఇతర మతాలని ద్వేషించడం, మరీ ముఖ్యంగా మహమ్మదీయ సమాజాన్ని ద్వేషించడం హిందూలో భాగం కాదు. హిందూ, ముస్లింల మధ్య ఒక తాత్విక సంబంధం వుంది. ఆ తాత్విక సంబంధంతోనే ఒక ప్రత్యేకమయిన సంస్కృతిని మనం అభివృద్ధి పరిచాము.

'హిందూ' చాలా విస్తృతమయిన కేన్వాస్ కలిగిన నవల. ఇందులో కథానాయకుడు ఒక ఆర్కియాలజిస్టు. 5000 సంవత్సరాల చరిత్ర కలిగిన 'హిందూ'ను తిరిగి నిర్వచించే పనికి పూనుకుంటాడు. సమకాలీన అంశాలయిన స్త్రీ వాదము, కులం, 'హిందూ'లో ఎలా ఉన్నాయో విశదీకరిస్తాడు.

చంద్రగుప్త మౌర్యుడు హిందువు కాదు. అతడు మధ్య ఆసియా నుండి వచ్చాడు. అదీ ఒక గిరిజన తెగ నుండి. కానీ గొప్ప క్షత్రియుడు కాగలిగాడు. శివాజీ కూడా క్షత్రియుడు కాదు. ఒక నిమ్న కులానికి చెందినవాడు. కానీ గొప్ప క్షత్రియుడు కాగలిగాడు. దీన్ని బట్టి వర్ణవ్యవస్థ కూడా చాలా సరళంగా వుంది. ఇవన్నీ ఒక దానితో మరొకటి ముడిపడి అల్లుకుపోయాయి. వీటన్నింటిని 'హిందూ'లో నెమాడే చర్చించారు.

ఆంగ్ల భాష ఇతర భాషలని ధ్వంసం చేస్తున్నదని నెమాడే నమ్ముతారు. ఆంగ్లభాషలో రాయటమంటే తనదైన వేళ్ళు లేకపోవడం అంటారు ఆయన. మూలాలు లేని తనం సాహిత్యానికి పనికిరాదు. 'దేశీవాద్' లాంటి విమర్శ గ్రంథాలు తప్పిస్తే నెమాడే సృజన అంతా మరాఠీలోనే కొనసాగింది.

ఆంగ్లంలో రాయటం వలన ఒక రచనకి సాధికారికత రాదు అని ఆయన నమ్ముతారు.

"నేను మరాఠీలో రాశాను అనుకోండి! అది మీకు అర్థం అవుతుంది. ప్రతి పదానికీ అర్థం మీకు తెలుసు. మరాఠీలోనే మరో మాండలికంలో నేను రాసినా మీరు ఎక్కువగా కష్టపడరు. భాషకి ఉన్న అన్ని పరాన్ముఖ కోణాలని మీరు ఎప్పుడు అర్థం చేసుకుంటారు? మీరు ఆ భాషను మీ సొంతం చేసుకుని దాన్ని వినియోగిస్తున్నప్పుడే. అప్పుడే దాని మీద మీకు సాధికారికత వస్తుంది. వలస పాలనలో సాధికారికతకి స్థానం లేదు. భారతదేశాన్ని రెండు వందల సంవత్సరాలు పరిపాలించిన ఆంగ్లేయులు, తమ భాషలో ఏ మాత్రం సంబంధంలేని భారతీయులతో ఆంగ్లంలో సంభాషించారు. ఇది ఎలా వుంటుంది అంటే ఒక తెల్ల పిల్ల స్వరంలో ఒక నల్ల పిల్ల పాటని గుది గుచ్చడం లాగా' వుంటుంది! ఇది ఒక రకంగా టూరిస్ట్ నేరేషన్.

మనిషి పుట్టీ పుట్టగానే తన భాష కోసం వెతుక్కుంటాడు. కొన్ని సంవత్సరాలపాటు కొనసాగే భాషా సంపర్కం మనిషిని ఆ భాష సాంస్కృతిక నేపథ్యంలో, చరిత్రలో కలగలిసిపోయేలా చేస్తుంది. భాషా సంప్రదాయం మనిషి లోలోపల జీర్ణించుకుని పోతుంది.

ఒక్కసారిగా పరాయి భాషకి మారటం అంటే మనిషి తనకు తెలియని సంస్కృతిలోకి, సంప్ర దాయంలోకి ప్రయాణించటం. అప్పుడు తాను సంభాషించడానికీ, అవసరాలని తీర్చడానికీ కావలసిన పదాలను, వాక్యాలను ఎంచుకోవటంతోనే సరిపోతుంది.

తన సొంత భాషలో ఒక కొత్త సంప్రదాయాన్ని, ఒక కొత్త స్ట్రక్చర్‌ను సృష్టించినట్లుగా పరాయి భాషలో ఒక విలువని కానీ, ఒక శైలిని కానీ మనిషి సృష్టించలేడు.

300 పేజీల తెల్ల కాయితాలను నలుపురంగు అక్షరాలతో నింపటం కాదు కదా సాహిత్యమంటే! సృష్టించే దానిలో జీవం ఉండాలి. జవం ఉండాలి. సంస్కృతి, సంప్రదాయం, స్త్రీలు, వాళ్ళ దు:ఖాలు, ఆనందాలు, జానపదం, జ్ఞానపథం ఇవన్నీ వుంటేనే సాహిత్యం అవుతుంది.

'లాంగ్వేజ్ ఈజ్ ఎ జనరిక్ యాక్టివిటి' అని నోమ్ చామ్‌స్కీ తరువాత వాదించినవారు ఎవరూ లేరు. అది దురదృష్టం అంటారు నెమాడే.

ఈ చర్చనంతా ఆయన దేశీవాద్‌లో చేశారు. సాహిత్యం విశ్వజనీనం కావాలనే సరిహద్దులు దాటి వెళ్ళాలనే భావన పట్ల నెమాడేకి సదభిప్రాయం లేదు.

మంచి సాహిత్యం ఎప్పుడూ తన ప్రజల గురించే కలవరిస్తుంది. తన భాష, తన సంస్కృతి రచయితలకు ఎప్పుడూ ముఖ్యం. ఒక మరాఠీ రచయితో, ఒక తెలుగు రచయితో, తనది కాని భాషలో రాస్తున్నాడు అంటే తన కల్చర్‌ని, తన భాషని అవసరం లేదని భావించే మరొక కల్చర్‌కి, భాషకి అందించాలని ప్రయత్నిస్తున్నాడన్న మాట. సాహిత్యం చదివేవారికీ, రాసే వారికీ మధ్య వుండవలసిన అర్థవంతమయిన అవగాహన లేకపోతే, ఆ సృజన అంతా వృథా!

షేక్స్పియర్‌కి అంతర్జాతీయ ఖ్యాతి లభించింది అంటే అదంతా సామ్రాజ్యవాద మహిమ అంటారు నెమాడే. మరాఠీ భక్తికవి తుకారామ్‌కో, తెలుగు రామదాసుకో అంతర్జాతీయ ఖ్యాతి లభించలేదు అంటే తెలుగు వారు కానీ, మరాఠీలు కానీ ఎప్పుడూ అంతర్జాతీయంగా పాలకులుగా లేరు. ఆంగ్లేయులు పాలకులు అయినారు కనుక షేక్స్పియర్‌ను మనమీద బలవంతంగా రుద్దారు అంటారు నెమాడే!

సమకాలీన భారతీయ సాహిత్యంలో నెమాడే ఒక తిరుగుబాటు దారుడు. తను నమ్మిన దానికోసం ఎంత వరకైనా వెళ్ళగల నిబద్ధత కలిగినవాడు.

ఇంగ్లీషు, మరాఠీ సాహిత్యం తులనాత్మక అధ్యయనం, ఆంగ్ల భాషాశాస్త్రం కొన్ని దశాబ్దాల

మంచి సాహిత్యం ఎప్పుడూ తన ప్రజల గురించే కలవరిస్తుంది. తన భాష, తన సంస్కృతి రచయితలకు ఎప్పుడూ ముఖ్యం. ఒక మరాఠీ రచయితో, ఒక తెలుగు రచయితో, తనది కాని భాషలో రాస్తున్నాడు అంటే తన కల్చర్‌ని, తన భాషని అవసరం లేదని భావించే మరొక కల్చర్‌కి, భాషకి అందించాలని ప్రయత్నిస్తున్నాడన్న మాట. సాహిత్యం చదివేవారికీ, రాసే వారికీ మధ్య వుండవలసిన అర్థవంతమయిన అవగాహన లేకపోతే, ఆ సృజన అంతా వృథా!



పాటు అనేక యూనివర్శిటీలలో స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో బోధించిన నెమాడే 1938లో మహారాష్ట్ర ఉత్తర ప్రాంతంలో, గుజరాత్, మరాఠీ భాషా సంప్రదాయాలు జమిలిగా ఉన్న ప్రదేశంలో జన్మించారు.

ఆ ప్రాంతంలో ఎక్కువగా వుండే గిరిజన తెగలు పాడుకునే జానపద గీతాలు నెమాడేకి సాహిత్యంలో తొలి పరిచయం కలిగించాయి. ఆ తొలి జానపద గీతాల ప్రభావం నెమాడేను జీవితాంతం వెంటాడుతూనే వుంది.

రచయితగా తనను తాను పునరుక్తం చేసుకోవటం అంటే నెమాడేకు అస్సలు నచ్చదు. ఆంగ్లము, ఆంత్రపాలజీ, మరాఠీ సాహిత్యం ఇలా ఒక దానితో మరొక దానికి పోలిక లేని విషయాలను బోధించే అధ్యాపకుడిగా నెమాడే పఠనానుభవం విస్తృతమయినది.

ఆ అనుభవమే తనను తాను పునశ్చరణ చేసుకోకుండా కాపాడింది అంటారు నెమాడే. అందుకేనేమో నెమాడే కోస్లాకి, బీదర్‌కి, హిందూకి అతడి కవిత్వ సంపుటి 'రఖనీ'కి రూపంలోనూ, సారంలోనూ ఎక్కడా పోలిక వుండదు.

ఎప్పుడో శతాబ్దాల క్రితం తమిళనాడులోని ఒక మారుమూల పల్లెటూరులో ఉన్న ఒకానొక ఆచారం ఆధారంగా 'మధోర్ భగన్' రాసిన తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్‌ను స్వయంగా మృత్యు ప్రకటన చేసేంతవరకు వెంటాడినయి కొన్ని హిందూ తీవ్ర వాద సంస్థలు. శ్రీకృష్ణుడిని ఇమ్మోరల్ అని 'హిందూ'లో వ్యాఖ్యానించిన 'నెమాడే'కి జ్ఞానపీఠ పురస్కారం అందుకుంటున్నప్పుడు ఎలా స్పందిస్తాయో చూద్దాం!

– వంశీకృష్ణ, 9573427422

బుచ్చిబాబు ఊహాచిత్రాలు

సుప్రసిద్ధ రచయిత ఊహాశాలిత అబ్బురపరుస్తుంది. ఉదాత్తమైన రచనలు చేసిన ఆయన సరదాగా అనిపించే విశేషమై వ్యాఖ్యానాలు చేశారు. కొన్నిటికి భాష్యాలు చెప్పారు. ప్రయోగాత్మకమూ. వినూత్నమూ అనిపించిన వారి వాక్యాలు చదవండి.

కీటకాల చివరిమాటలు

సీతాకోక చిలుక : (గొంగళి పురుగు దశలో): మీ కంబళ్ళకు నే తగనుగా. (తరువాత దశలో) చేనేత వస్త్రాల వారిపై దావా పడెయ్యాలి.

గొల్లభామ: యాదవభామగా స్మరించండి నన్ను.

నల్లి: నరకంలో బోలెడు రక్తం

సాలీడు: ఇంద్రుడి కిరీటంలో గూడల్లుతా.

దోమ: నన్ను మీరు చంపలేరు. ఇది ఆత్మహత్య.

మిణుగురు పురుగు : ప్రళయ కాల మహోగ్ర భయద జీమూ తోరు గళ ఘోర గంభీర ఫెళఫెళార్భటులలో మెఱపేలా? (నోరు తిరక్క చచ్చిపోతుంది)

పక్షుల చివరి మాటలు

నెమలి: (జాతీయపక్షిగా నిర్ణయం జరిగిన తర్వాత) అమరజీవి నన్నారు పైగా!

గబ్బిలం: రాడారుగా వాడితే వెనక్కొస్తాను.

గుడ్లగూబ: నన్నెవ్వరూ పెంచుకోరు కావున, పోతాను నా కళ్ళని మీ కళ్ళజోడుగా పీకేముందు.

కోడి: తేలు కుట్టింది.

చిలుక: వేదం వల్లెవేస్తాను.

కాకి: నా మరణవార్త పత్రికలలో పడదు. (కాకి కబురు)

మగకాకి: నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాను. (కాకి గోల)

పావురం: రంభ వక్షంపై మకాం పెడతా.

జోక్స్ కార్నర్

పేరేంటో...

అజయ్ : ఏడుస్తూ ఏడిపించేవాడ్ని నిరాశావాది అంటారు. మరి నవ్వుతూ నవ్వించేవాడిని ఏమంటారు?

విజయ్ : జోకిస్ట్ అంటారు.

షాక్

గోపాల్ : ఏ సినిమా ప్రకటనకు ప్రేక్షకులు షాకవుతారు?

కృష్ణ : మా సినిమా హాల్లో దోమలు కరిచినందువల్ల డెంగ్యూ వస్తే అది మా బాధ్యత కాదు అన్న ప్రకటన చూసినప్పుడు.

- ఆనంద్‌రెడ్డి

ప్రత్యామ్నాయం

తల్లి : ఏరా కుక్కపిల్లకు అన్నం పెట్టావా?

కొడుకు : పెడదామనుకున్నా కానీ, అన్నంలేదు. అందుకే పది రూపాయలిచ్చి ఏదైనా కొనుక్కొని తినమన్నాను.

ప్రయోగం

దీప్తి: దేవుడు ముందు మగవారిని పుట్టించి, ఆ తర్వాత ఆడవారిని ఎందుకు పుట్టించాడో తెలుసా?

లాస్య: ఎందుకు?

దీప్తి: ప్రతి ఒక్కరు కొత్త విషయాన్ని కనిపెట్టే ముందు ఎక్స్‌పరిమెంట్ చేస్తారు కదా! ఇది కూడా అంతే. దేవుడు ముందు ఎక్స్‌పరిమెంట్‌గా మగవారిని పుట్టించి, ఆ తర్వాత పర్‌ఫెక్ట్‌గా ఆడవారిని పుట్టించాడు.

తిరిగి వచ్చింది



డాక్టర్ మూర్తి: రావయ్యా వీరేశం. ఇప్పుడే నీ గురించి చెప్పారు మా వాళ్ళు.

వీరేశం: ఏం చెప్పారు సార్.

డాక్టర్: ఫీజు కింద నువ్వు ఇచ్చిన చెక్ బౌన్సయిందని.

వీరేశం: నిజంగానే సార్. మీరు నయం చేసిన జబ్బు కూడా తిరిగి వచ్చింది సార్.

మిత్రులు వచ్చి ఎంత కాలమైంది?

జీవితంలో స్నేహితులు చాలా ముఖ్యమైన భాగం. బతుకులో ఉత్సాహానికీ, ఆనందానికీ, తెలియని అద్భుతాలకీ మూలం స్నేహితులు. అందుకే అప్పుడప్పుడు కలవాలి. కలుసుకోవాలి. కబుర్లెన్నో కలబోసుకోవాలి. కెరీర్‌లో బిజీగా ఉన్నా, తీరుబడి లేని పనుల్లో ఉన్నా స్నేహితుల్ని మరిచిపోకూడదు. మిత్రులతో గడిపే కాలం ఎంతో విలువైంది.



★ అసలు మీకు చాలా ముఖ్యమైన మిత్రులు ఎవరున్నారో ఆలోచించుకోండి. వారిని కలిసి ఎన్నాళ్ళయిందో గుర్తు చేసుకోండి.

★ ఏవైనా పనులుంటేనో, అవసరాలుంటేనో తప్ప కలవడం, మాట్లాడుకోవడం అరుదయింది. కానీ స్నేహితుల్ని పనులు ఉన్నా లేకున్నా పలకరించాలి. మాట్లాడాలి. ఇలా మాట్లాడి ఎన్నాళ్ళయిందో తరచి చూసుకోండి.

★ ఆర్నెల్ల నుంచి పలకరించకపోతే కనీసం ఒక ఫోను కాల్ చేయండి. వీలయితే నాలుగురోజుల తర్వాత కాఫీకో, టీకో ఏదైనా రెస్టారెంట్‌లో కలవండి.

★ మీ పనుల మీద పొద్దున తొమ్మిదికో, పది గంటలకో బయటికి వెళతారు. మళ్ళీ రాత్రి ఏ పది గంటలకో తప్ప ఇంటిముఖం చూడరు. ఇలాంటి స్థితిలో ఉన్న మీ ఇంటికి మిత్రులు వచ్చి ఎన్నాళ్ళయిందో ఎప్పుడయినా ఆలోచించారా? ఒక గంటసేపు మిత్రులతో గడిపి ఎన్ని నెలలయింది? ఎన్ని సంవత్సరాలయింది?

★ మిత్రుల్ని కలుసుకోడం సైతం పనిగా పెట్టుకోవాలి. కచ్చితంగా ప్లాన్ చేసుకొని కలవాలి. ఒకే ఊళ్ళో, ఒకే నగరంలో వున్నా ఏ పెళ్ళిలోనో, ఎవరి చావులోనో తప్ప ముఖాలు చూడకుండా వుండిపోతున్నారు మనుషులు. ఈరకమైన సంబంధాల తీరు మారాలి.

★ ఆఫీసుపనుల్లోనో, ఇతరేతర వ్యాపకాల్లోనో బిజీగా ఉండొచ్చుగాక, కానీ ఇల్లు, ఆఫీసు తప్ప మరో ప్రపంచం లేకపోతే ఎలా? ముఖ్యంగా స్నేహితులు అక్కర్లేదా? అందుకని బ్రేక్‌ఫాస్ట్ కోసమో, లంచ్ లేదా డిన్నర్ కోసమో అప్పుడప్పుడు మిత్రుల్ని కలవడానికి ప్రయత్నించండి.

★ కొందర్ని అనుకున్నదే తడవుగా కలుసుకోలేరు. కనీసం ఫోనులో పలకరించండి. మాట్లాడండి. మంచి చెడ్డా, కష్టం సుఖం తెలుసుకోండి. బాధల్లో వుంటే వెళ్ళి ఓ పావుగంట కూర్చొని రండి.

జీవితంలో ఎవరూ ఉండరు మిత్రులు తప్ప. కుటుంబం ఉండటం అనివార్యం. కానీ స్నేహితులు దొరకరు. నిలబెట్టుకోవాలి. నిలబెట్టుకోడానికి మీ ప్రయత్నం మీరు చేయాలి. ❋

■ అనుబంధం

అనుబంధాల్లో మేనత్త పాత్ర

మన సంస్కృతి చాలా గొప్పది. నేటి కన్నా పూర్వపు రోజుల్లో అనుబంధాలు, ఆత్మీయతలు, సంప్రదాయాలకు పెద్ద పీట వేసేవారు. నాగరికత పెరిగిన కొద్దీ ఆపేక్షలు, ఆరివారాలు అంతరించి పోతున్నాయేమో అని అనిపిస్తుంది. నేడు అంతా కృత్రిమం. అంతా ఇన్‌స్టెంట్. అప్పటికప్పుడు తెచ్చిపెట్టుకోవడమే. పూర్వకాలంలో ఎవరి పాత్రను వారు బాధ్యతాయుతంగా నిర్వర్తించేవారు. తాత-అమ్మమ్మ, తాత - నాయనమ్మ, చిన్నమ్మ-చిన్నాన, మేనత్త, మేనమామ. ఇట్లా ఒక్కొక్కళ్ళు ఒక్కోరకం ప్రేమ కనబరుస్తూ ఉండేవారు.

అనుబంధాల్లో మేనత్త పాత్ర ఎంత గొప్పదో! నాన్న అక్కనో, చెల్లెలో అయి అన్న పిల్లల్ని, తమ్ముడి పిల్లల్ని ఆప్యాయంగా చూసుకునే గొప్పవ్యక్తి మేనత్త. పెళ్ళికానప్పుడు అన్న పిల్లల్ని ఆడించటం ఆమెవంతే. పెళ్ళయి అత్తగారింటికి వెళ్తుంటే "వద్దు నీవు ఇక్కడే వుండు అత్తా" అని పెళ్ళికొడుకుని విలన్‌లా చూసిన ఆ చిన్నారుల అనుబంధం వాళ్ళత్తకే తెలుసు. 'పెద్దత్త' (పద్మ) 'ససత్త' (సరోజ)... ఇవి ఆప్యాయంగా పిలుచుకునే పిలుపులు.

అన్నకొడుకు ఎన్నో ఏళ్ళ తరువాత మేనత్త ఊరు వెతుక్కుంటూ మారుమూల పల్లెకు రావటం ఊరి వారినందరినీ ఆశ్చర్యపరిచింది అల్లుణ్ణి చూసి ఎంత సంబుర పడిపోయిందో! అత్తను వెంబడించుకొని వెళ్ళాడు అల్లుడు. కాని ముసలాయనకు ఒకటే భయం భార్య వస్తుందో రాదోనని.

అత్త వస్తుందంటే ఎంత సంబరమో పిల్లలకి. అన్నం తినిపిస్తుంది, ఆడిస్తుంది, కథలు చెబుతుంది. ఇక అత్త పిల్లలతో వచ్చిందంటే ఇంకా ఆనందం. ఆడుకోవడానికి తోడు. సెలవుల్లో మేనత్త దగ్గరికి వెళ్ళటమంటే ఆనందానికి అవధులుండవు. అక్కడ అల్లరికి అడ్డంకులుండవు. కేకలేసే నాన్న, కోప్పడే అమ్మ అక్కడ ఉండరుగా!

"ఎప్పుడో కానిరారు" అని ఎంత అల్లరి చేసినా అత్త ఏమీ అనదు. దానితో 'ఆడిందే ఆట పాడిందే పాట'

అన్న భార్యో, తమ్ముడి భార్యో చనిపోతే ఆడ దిక్కులేని ఆ పిల్లల్ని చేరదీసి పెంచి పెద్ద చేసి మేనత్తే పెళ్ళిళ్ళు చేసిన సందర్భాలు ఎన్నో! ఇంకా గొప్ప విషయం ఏమిటంటే పూర్వకాలంలో ఎంత ఎక్కువ సంతానం వుంటె అంతగొప్ప. సంతానమే సౌభాగ్యంగా భావించిన రోజులవి. తనకు ఆడ, మగ ఇద్దరు సంతానం ఉన్నా తమ్ముడు చనిపోతే చిన్నవాడుగా వున్న తమ్ముడి కొడుకు ఎక్కడ అనాథ అయిపోతాడోనని "నువ్వు నా రెండో పెళ్ళికి అంగీకరిస్తే నేను నీ తమ్ముడి కొడుకును చేరదీస్తానన్న" భర్త షరతుకు అంగీకరించగలిగే అమాయకురాలు, కరుణామయి మేనత్త. ఇంతకన్నా గొప్పత్యాగం ఇంకేముంటుంది చెప్పండి?

అన్నదమ్ముల పట్ల సానుభూతి, ప్రేమలే మేనరికాలకు కారణం అని చెప్పవచ్చు. సైన్సు ప్రకారం మంచిది కాదని వారికి ఆ రోజుల్లో అంతగా తెలియదు కాబోలు!

పిల్లలు పలికే మొదటి పలుకు అత్త. 'త్త..త్త..త్త..., అత్తత్త..., అత్త...' అని పలకటం నేర్చుకుని ఇంటిల్లిపాదికి ఆనందం పంచి, అందరికీ పంచదార చిలుకలు పంచేలా చేస్తారు. అత్త పలుకు ఎంత మధురమో! ఓ సినీకవి "అత్త ఒడి పువ్వు వలె మెత్తనమ్మా ఆదమరిచి హాయిగా నిదురపోమ్మా" అని అత్తఒడిని వర్ణించిన తీరు అద్భుతం. పూర్వకాలంలో మగవాళ్ళకి పెళ్ళిళ్ళవటం చాలా కష్టంగా ఉండేది. అందుకు కారణం ఆడపిల్లల సంఖ్య తక్కువేమో! 'కన్యాశుల్కం' చెల్లించి ఆడ పిల్లలని తెచ్చుకునేవారు. కన్యాశుల్కానికి మరోపేరు 'ఓలి'. భార్య చనిపోతే కర్ణాటక, ఇతర రాష్ట్రాలనుంచి ఆడపిల్లలు చిన్నగా వున్నప్పుడే కొని తెచ్చుకొని పెళ్ళి చేసుకునేవారు. ఎప్పుడో చిన్నప్పుడు ఇక్కడికివచ్చి ఇక్కడి వాళ్ళతో మమేకమైనా మాతృ భాష ముద్ర వారి మాటల్లో కనబడుతుండేది. తొందరగా అంటే 'బేగి'అని. పప్పును 'బేళ్'కి బదులుగా 'బ్యాళ్ళు'అని వింటుంటే తమాషాగా ఉండేది. ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే అలా కొనబడిన ఓ అమ్మాయి అన్నకొడుకు ఎన్నో ఏళ్ళ తరువాత మేనత్త ఊరు వెతుక్కుంటూ మారుమూల పల్లెకు రావటం ఊరి వారినందరినీ ఆశ్చర్యపరిచింది (అప్పుడు ఆమె వయసు 60 ఏళ్ళు). అల్లుణ్ణి చూసి ఎంత సంబుర పడిపోయిందో! అత్తను వెంబడించుకొని వెళ్ళాడు అల్లుడు. కాని ముసలాయనకు ఒకటే భయం భార్య వస్తుందో రాదోనని. కాని చీర, సారె, మైసూరు సాండిల్ సబ్బులు, ఘుమ ఘుమలాడే కాఫీ పొడితో అల్లుడు వెంటబెట్టుకొని వచ్చి దిగి బెట్టి వెళ్ళాడు. ఆ మార్నాడే సూటులో భార్యతో దిగిన అల్లుని ఫోటోను గోడకు తగిలించి అందరికీ మురిపెంగా చెప్పుకునేది 'మా అన్నకొడుకని. అదీ అత్తప్రేమ.

ఇంట్లో జరిగే పెళ్ళిళ్ళలో పై తరం ఆడపడచుగా పెత్తనం చెలాయించుకోవటం, మేనల్లుడి భార్యతో 'నేనెవరినో తెలుసా మొండి చుట్టం మొగుడి మేనత్తను' అని చమత్కరించటం మేనత్తకు కాక ఇంకెవరికి చెల్లుతుంది? పుట్టింటి వారికి ఒక ఆసరాగా, అండగా నిలుస్తుంది. సోదరులకు సలహాలనిచ్చి, సంప్రదింపులు జరిపే గొప్ప వ్యవహారవేత్త. సోదరుల పిల్లలకు ఆప్యాతయతలు పంచే అనురాగమూర్తి, కల్పవల్లి. పుట్టింటి వారసుడు అల్లుడు అంటే అంతప్రేమ ఆమెకు.

అత్తగారింట్లో ఎదురయ్యే వ్యతిరేకతలను మౌనంగా సహిస్తూ తన గంభీరతను చాటుకునే గొప్ప ధీశాలి. ఆమెచేసే నిష్కపట, నిర్మల చర్యలకు భగవంతుడు సహకరిస్తాడేమో! అందుకే ఆమెది మొక్కవోనిధైర్యం. వాత్సల్యం, ప్రేమ, అభిమానమే ఆమె మూలధనం.

దురదృష్టం కొద్దీ భర్తను పోగొట్టుకొని పుట్టింటికి చేరి, ఆమె చేసే సేవలు శ్లాఘనీయం. కొత్తగా పెళ్లైన మేనకోడలికి సహాయకారిగా వెళ్ళి సేవలందిచేది మేనత్తే. ఇలా ఎన్నో రూపాంతరాలు. "కలికి చిలకల కొలికి మాకు మేనత్త, కలవారి కోడలు కనక మాలక్ష్మి" అని పొగడ్తలను పొందిన మేనత్త ఎంత గొప్పదంటే అంత గొప్పది.

పిల్లలని తొట్లో వేసేటప్పుడు పేరు చెవిలో చెప్పి వీపు చరిపించుకునేది మేనత్తతోనే. ఈ విధంగా ఎన్నో గౌరవాలను పొందుతుంది. అందుకని ఆమె గురించి ఎంత చెప్పినా తక్కువే. పిల్లలని ఆడించే ఆటల్లో కూడా 'అత్త గారింటికి అత్తగారింటికి' అని గిలిగింతలు పెట్టి పిల్లలని నవ్వించటం అందరికీ ఒక మధురానుభూతి.

- ఎస్.స్వయంప్రభ, హైదరాబాద్

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

జీమెయిల్‌లోని 10 ప్రయోగాత్మక ఫీచర్లు

ప్రస్తుత స్పీడ్ యుగంలో ఈమెయిల్ అనేది సర్వసాధారణమైంది. జీమెయిల్ సహా యాహూ, రెడిఫ్, హాట్‌మెయిల్ తదితర అనేక సంస్థలు ఉచిత ఇమెయిల్ సర్వీస్‌ను అందిస్తున్నాయి. ఆధునాతన సాంకేతిక యుగంలో శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనాల్లో జీమెయిల్ ఒకటి. జీమెయిల్ గురించి తెలియని ఇంటర్నెట్ వినియోగదార్లు ప్రపంచంలోనే ఎవరు ఉండరంటే అతిశయోక్తికాదు. గూగుల్ అందిస్తోన్న అత్యుత్తమ సేవల్లో జీమెయిల్ ఒకటి. ఈ జీమెయిల్ తెలుగుతో సహా దాదాపు 50కి పైగా భాషల్లో అందుబాటులో ఉంది. గూగుల్ కల్పించిన తాజా సౌలభ్యతతో జీమెయిల్ నుంచి గూగుల్‌లో అందుబాటులో ఉన్న అన్ని సర్వీసులను ఒకే క్లిక్కుతో పొందవచ్చు. జీమెయిల్‌లో అందుబాటులో ఉన్న కొన్ని ముఖ్యమైన ఫీచర్లను చూద్దాం....

Undo Send (అన్‌డూ సెండ్) : సాధారణంగా ఏవైనా డాక్యుమెంట్లను మనం ఎవరికైనా మెయిల్ చేసినప్పుడు, వాటిలో తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేసి మరోసారి మెయిల్ చేస్తాం. కానీ జీమెయిల్‌లో వున్న Undo Send ఫీచర్‌ను కాన్ఫిగర్ చేసుకుంటే... మనం మెయిల్ పంపిన 30 సెకన్ల లోపు అండూ బటన్ ప్రెస్ చేసి ఆపు చేసుకునే అవకాశముంది. 5నుంచి 30సెకన్లలోపు ఎంత సమయం అనేది కూడా మనం సెట్ చేసుకోవచ్చు. జీమెయిల్ సెట్టింగ్స్‌లోని జనరల్‌కి వెళ్లి Undo Send ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకుంటే ఈ సదుపాయం మీకు అందుబాటులో ఉంటుంది.

కాన్ఫిగర్ ఇన్‌బాక్స్ : ఇన్‌బాక్స్‌లో ఉన్న మరో మంచి ఫీచర్ ఇది. మనకొచ్చే మెయిల్స్ అన్నీ కలగాపులగం కాకుండా ప్రైమరీ, సోషల్, ప్రమోషన్స్ అన్న మూడు వర్గాలుగా విభజించి చూపుతుంది. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల సమాచారం, పోస్ట్‌లు అన్నీ సోషల్ ట్యాబ్ కింద, కంపెనీలు పంపే వ్యాపార మెయిళ్లన్నీ ప్రమోషన్‌లోనూ పడిపోతాయి. ఇవేకాకుండా ఫోరమ్స్, అప్‌డేట్స్ అన్న ఇతర కేటగిరీలుగానూ విభజించుకునే వెసులుబాటు ఉంది.

మేనేజ్ కాంటాక్ట్స్ : స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్స్ అన్నింటిని గూగుల్ అకౌంట్‌తో ఆటోమెటిక్‌గా సింక్రనైజింగ్ చేసుకోవచ్చు. టాబ్లెట్ లేక స్మార్ట్‌ఫోన్‌లో మెయిల్ ఐడీతో సైనిన్ అయినపుడు జీమెయిల్‌లో ఉన్న కాంటాక్ట్స్ అడ్రస్ బుక్‌ని అప్‌డేట్ చేసుకుంటే చాలు. కాంటాక్ట్స్ అన్నీ ఆటోమెటిక్‌గా సింక్రనైజ్ అవుతాయి.

సింక్రనైజ్ కాంటాక్ట్స్ : మీరు ఆండ్రాయిడ్ డివైజ్‌ను ఉపయోగిస్తుంటే కనుక సెట్టింగ్స్‌లోకి వెళ్లి యాడ్ అకౌంట్‌పై క్లిక్ చేయాలి. తరువాత మెయిల్‌ఐడీ, పాస్‌వర్డ్‌ని ఎంటర్ చేసి సైనిన్ కావాలి. ఇప్పుడు సింక్రనైజ్ కాంటాక్ట్స్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్స్ అన్నీ సింక్రనైజ్ అయిపోతాయి. ఇదే విధంగా ఐఓఎస్, విండోస్ ఫోన్, బ్లాక్‌బెర్రీ డివైజ్‌ల్లో కూడా కాంటాక్ట్స్ సింక్రనైజ్ చేసుకోవచ్చు.

ఫైండ్ అండ్ మెర్జ్ : లెఫ్ట్ కార్నర్‌లో టాప్‌లో ఉన్న జీమెయిల్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్స్, టాస్క్స్ అని రెండు ఆప్షన్లు ప్రత్యక్షమవుతాయి. అందులో కాంటాక్ట్స్‌ని ఎంచుకోవాలి. తరువాత మోర్‌పై క్లిక్ చేసి ఫైండ్ అండ్ మెర్జ్ కాంటాక్ట్స్‌ని సెలక్ట్ చేయాలి. అప్పుడు మీ అడ్రస్‌బుక్‌లో ఉన్న డబుల్ ఎంట్రీస్ అన్నీ లిస్ట్ రూపంలో కనిపిస్తాయి. దేన్ని కంబైన్ చేయాలనుకుంటున్నారో సెలక్ట్ చేసి మెర్జ్‌పై క్లిక్ చేయాలి.

రీస్టోర్ అడ్రస్ : ఒకవేళ మీరు మొబైల్ డివైజ్‌లో నుంచి కాంటాక్ట్స్ డిలీట్ చేసినపుడు గూగుల్ అకౌంట్‌లోని కాంటాక్ట్ కూడా డిలీట్ అవుతుంది. అయితే డిలీట్ అయిన కాంటాక్ట్స్‌ను రీస్టోర్ చేసుకోవాలనుకుంటే డిలీట్ చేసిన 30 రోజుల్లోగా రికవరీ చేసుకోవచ్చు. కాంటాక్ట్స్‌లోకి వెళ్లి మోర్‌పై క్లిక్ చేసి రీస్టోర్ కాంటాక్ట్స్‌ని ఎంచుకోవాలి. రీస్టోర్‌పై క్లిక్ చేస్తే డిలీట్ అయిన కాంటాక్ట్స్ రీస్టోర్ అవుతాయి.

ఫిల్టర్ క్రియేట్ చేసుకోవడం : జీమెయిల్ ఇన్‌బాక్స్‌లో రైట్ కార్నర్‌లో టాప్‌లో ఉన్న గేర్ సింబల్‌పై క్లిక్ చేసి సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫిల్టర్‌ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. తరువాత క్రియేట్ న్యూ ఫిల్టర్‌పై క్లిక్ చేస్తే ఒక విండో ఓపెన్ అవుతుంది. అందులో ఫ్రం, టు, సబ్జెక్ట్, హైస్ ద వర్డ్స్, హైస్ ద అటాచ్‌మెంట్ అని ఉంటాయి. వాటిని ఫిల్ చేసిన తరువాత క్రియేట్ ఫిల్టర్ విత్ దిస్ సెర్చ్‌ని ఎంచుకోవాలి. దీన్ని ఎంచుకోవడం ద్వారా స్కిప్ ద ఇన్‌బాక్స్, అప్లై ద లేబుల్, డిలీట్ ఇట్ వంటి యాక్షన్ లను ఎంచుకోవచ్చు. వీటిని ఎంచుకోవడం ద్వారా మీ మెయిల్స్ అన్నీ సార్టింగ్ చేయబడతాయి. మీరు ఎంచుకున్న ఫిల్టర్ యాక్షన్స్‌కు అనుగుణంగా డిలీట్ చేయబడతాయి.

ల్యాబ్స్ : జీమెయిల్ ఇన్‌బాక్స్‌లో రైట్ కార్నర్‌లో టాప్‌లో ఉన్న గేర్ సింబల్‌పై క్లిక్ చేసి సెట్టింగ్స్‌లోకి వెళ్లి ల్యాబ్ ఆప్షన్‌ని ఎంచుకోవాలి. అందులో మల్టిపుల్ ఇన్‌బాక్సెస్, ఆథంటికేషన్ ఐకాన్, అన్‌రీడ్ మెసేజ్ ఐకాన్ వంటి పలు రకాల ఆప్షన్లు ఉంటాయి. వాటిని ఎనేబుల్‌లో పెట్టుకోవడం ద్వారా వాటి ఫీచర్లను పొందవచ్చు. ఉదాహరణకి రైట్ సైడ్ చాట్ బాక్స్‌ను ఎంచుకోవడం ద్వారా చాట్ బాక్స్‌ను ఇన్‌బాక్స్‌కు కుడివైపున పెట్టుకోవచ్చు.

మేనేజ్ యువర్ డేట్స్ : జీమెయిల్ ఇన్‌బాక్స్‌లో రైట్ కార్నర్‌లో టాప్‌లో ఉన్న గేర్ సింబల్‌పై క్లిక్ చేసి సెట్టింగ్స్‌లోకి వెళ్లి ల్యాబ్ ఆప్షన్‌ని ఎంచుకోవాలి. అందులో గూగుల్ క్యాలెండర్ గాడ్జెట్ ఆప్షన్ దగ్గర ఎనేబుల్‌పై సెలక్ట్ చేసి సేవ్ ఛేంజెస్‌పై క్లిక్ చేయాలి. ఈ ఫీచర్ సహాయంతో ఈవెంట్స్ చూసుకోవడం, మీటింగ్స్ షెడ్యూల్‌ను అమర్చుకోవడం చేయవచ్చు. రోజువారి ఎజెండాను సులభంగా చదువుకోవచ్చు.

ఇవే కాకుండా జీమెయిల్ సెట్టింగ్స్ పేజీలోని కస్టమ్ కీబోర్డ్ షార్ట్‌కట్స్ ఫీచర్‌లోకి వెళ్లటం ద్వారా మీ మెయిల్ అకౌంట్‌కు సంబంధించి మీకు నచ్చిన విధంగా కీబోర్డ్ షాట్‌కట్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రివ్యూ ల్యాబ్స్ ఫీచర్ ద్వారా వివిధ సర్వీసుల నుంచి మీ మెయిల్‌కు అందే వీడియోలు, డాక్యుమెంట్లు, వాయిస్ మెయిల్స్, ఈమెయిల్స్ ఇంకా మెసేజ్‌లను ప్రివ్యూ రూపంలో చూడొచ్చు.

సెల్ : 9490099219

అందుకున్నాం

■ సమీక్షలు



ఒకానొక భ్రమ భవిష్యత్తు
సిగ్మండ్ ఫ్రాయిడ్
అనువాదం :
ఆనందేశి నాగరాజు
పేజీలు : 64
వెల : 40/-
ప్రతులకు :
అన్ని విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు

ఉద్యమాలకు స్ఫూర్తి
యువతకు ఆదర్శం
బొమ్మగాని ధర్మభిక్షం
కందిమళ్ళ ప్రతాపరెడ్డి
వెల : 40/-
పేజీలు : 56
ప్రతులకు : విశాలాంధ్ర
బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



కాలాన్ని వెనకేసిన మనిషి
మానవ జీవన పరిమాణ
పదచిత్రం
దేవరాజు మహారాజు
వెల : 80/-, పేజీలు : 92
ప్రతులకు : విశాలాంధ్ర,
ప్రజాశక్తి, నవోదయ, తెలుగు
పుస్తక కేంద్రాలు అన్నీ.

ప్రత్యూషపవనం
వెలుతురు పువ్వులు (నవలలు)
డా॥ఆలూరి విజయలక్ష్మి
వెల : 110/-, పేజీలు : 182
ప్రతులకు : డా॥ఆలూరి
విజయలక్ష్మి, 9849022441,
విశాలాంధ్ర బుక్‌హౌస్

శృంగారోపనిషత్
ఓషో
అనువాదం : భరత్
పేజీలు : 328,
వెల : 250/-
ప్రతులకు : విశాలాంధ్ర బుక్
హౌస్ అన్ని బ్రాంచీలు

కాశీరాజు ఆత్మగీతం



కాశీరాజు కవిత్వం, పేజీలు: 96, వెల: రూ. 80
ప్రచురణ: వాసిరెడ్డి పబ్లికేషన్స్, హైదరాబాద్, 90005 28717
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

అమాయకమైన పదాలకు కాసింత లాలిత్యాన్ని, అమ్మతనాన్ని, మట్టి గంధాన్ని కూర్చి కవిత్వం చేయడంలో కాశిరాజు చూపే ప్రతిభ విస్మయపరుస్తుంది. సాదాసీదాగా కనిపించే సంభాషణల్ని, సన్నివేశాల్ని అర్థవంతమైన కవిత్వంగా అభివ్యక్తం చేయడం కాశిరాజు పద్ధతి. అతని కవితా సంపుటి 'భూమధ్యరేఖ' చదివితే జీవితాన్ని, సమాజాన్ని, మనుషుల పోకడల్ని పట్టించుకునే తీరులోని వినూత్నత బోధపడుతుంది.

"మనుషుల్ని మనసులో దాచేసి కాలానికి వచ్చిపోవడం తెలుసు" అని అమ్మ చెప్పిన మాటల్లోని కవిత్వాన్ని పసిగట్టాడు. అలాగే అతి సాధారణమైన సహజాతాన్ని చెప్పిన తీరును చూస్తే ఈ కవి దృష్టి నైశిత్యం అబ్బురపరుస్తుంది– "మొన్న మధ్య పెళ్ళినోల్లు దుప్పట్లో దూరేసారని దీపం నిట్టూరుత్తుంటే దుప్పట్లోపటి చీకటేమో సిగ్గుల్ని చూడలేనట్టు కల్లగంతలు కట్టుకుంది". ఒక మనోహరమైన భావనని తేలికయిన పదాల్లో చెప్పడం ఎంత కష్టం! కానీ అది కాశిరాజుకు సుసాధ్యమైన పని. 'తాటాకిల్లు'ను కవిత్వం చేసిన విధం చూస్తే జీవితాన్నీ, మనుషుల్నీ, బతుకు వాస్తవ పార్శ్వాల్ని కాశీరాజు ఆకళింపు చేసుకున్న తీరు నచ్చుతుంది.

'ఆకలి సెగలో, పురిటి దు:ఖం, వానొస్తుంటే, ఎండకాలం గాలిబొమ్మ, బద్దెమంచం, పాత మొలతాడు, దేవగన్నేరు, నేరేడు లంకె' మొదలయిన కవితలు చదివితే చకితులమవుతాం. తనకు తెలిసీ తెలియకనే ఒక తాత్విక స్వరంతో కవిత్వం చెబుతున్న కాశీరాజు కవిత్వాన్ని జాగ్రత్తగా చదవాలి. అతని కలలు, కలవరాలు, ఆర్తితో కూడిన సంవేదనలు ఎలాంటి గాంభీర్యం లేకుండా సాధారణమైన గొంతుకలోంచి ఒలుకుతాయి. చాన్నాళ్ళ కిందటి సైదాచారి గుర్తుకొచ్చాడు ఈ కవిత్వం చదివితే. పాలపిట్ట దర్శనం కోసం దురాజ్‌పల్లి గుట్టలవైపు సాగిన పిల్లలు గుర్తుకొచ్చారు. అందుకని ఇది నోస్టాల్జియా కాదు. కలలోంచి మెలకువలోకి, మెలకువలోంచి కలలోకి, కల అని తెలిసి కూడా ఆ కలని కొనసాగించి సుప్త చేతనావస్థలోకి చేసే ప్రయాణం ఈ కవిత్వం అనవచ్చునా? ఏమో!

– కిరణ్‌కుమార్

సులభశైలిలో గతి తార్కిక భౌతికవాదం

గతి తార్కిక భౌతికవాదం చారిత్రక భౌతికవాదం
రచన: జక్కా వెంకయ్య, పేజీలు: 96, వెల: రూ. 50.
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

ప్రకృతి పరిణామ సూత్రాల్ని అవగాహన చేసుకోగలిగితే గతి తార్కిక భౌతికవాదం అంటే ఏమిటో అర్థం చేసుకోవడం సులువు. సిద్ధాంతాల్ని బరువైన మాటలతో కాకుండా తేలికయిన మాటల్లో భావస్ఫూర్తి విచ్చిత్తి కాకుండా చెప్పగలిగితే ఎక్కువమంది చదువుతారు. అర్థం చేసుకుంటారు. కనుక మార్క్సిజాన్ని, మార్క్సిస్టు సూత్రాల్ని వివరించే పద్ధతి, రాసే తీరు పాఠకులకు సౌలభ్యంగా ఉండాలి. జక్కా వెంకయ్య లాంటి పెద్దమనుషులకు బాగా తెలిసి వుంటుంది. 1967లో వారు రాసిన పుస్తకం "గతి తార్కిక భౌతికవాదం చారిత్రక భౌతికవాదం" చదివితే చాలా విషయాలు తేటతెల్లమవుతాయి. గతి తార్కిక భౌతికవాదం, చారిత్రత భౌతికవాదం అన్న పదాల్ని ఎలా అర్థం చేసుకోవాలో కూడా వెంకయ్య గారు చక్కగా వివరించారు. మార్క్సిజానికి సంబంధించిన సూత్రాలు సులభశైలిలో బోధించారు. మొత్తం పదహారు అధ్యాయాలున్నాయి. అయితే అన్నిటివి చదివి అర్థం చేసుకునే ముందు ఆత్మవిశ్వాసంతో ప్రయాణించాలి. భాష ఎలాంటి పాత్ర పోషిస్తుందో అవగాహన చేసుకోవాలి.

జిల్లా సాహిత్యచరిత్రలకు ఉపకరణం

పాలమూరు ఆధునిక యుగకవుల చరిత్ర
రచన: ఆచార్య ఎస్వీ రామారావు, పేజీలు: 196,
వెల: రూ. 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్

తన చరిత్రని తాను లిఖించుకుంటున్న సందర్భంలో వుంది తెలంగాణ. అందుకు ఆచార్య ఎస్వీరామారావు వంటి సాహితీవేత్తలు చేస్తున్న కృషి ఎంతగానో తోడ్పడుతుంది. ఇటీవల వారు పరంపరగా తెలంగాణ సాహిత్యచరిత్ర, పాలమూరు కవుల చరిత్ర మొదలయిన గ్రంథాల్ని వెలువరిస్తున్నారు. పాలమూరు సాహితీ వైభవం గురించి తెలియజేస్తూ వారి రెండో పుస్తకం 'పాలమూరు ఆధునిక యుగకవుల చరిత్ర' వెలువడింది. ఇరవ-య్యో శతాబ్దంలో పాలమూరు కవులు, రచయితలు తెలంగాణ సాహిత్యానికి అందించిన కంట్రిబ్యూషన్‌ని ఈ పుస్తకం వివరిస్తుంది. పాలమూరు జిల్లాకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు గురించి వైతాళికుల శీర్షికన అందించారు. ఆ తర్వాత ఆధునిక యుగకవుల శీర్షికన మరో 37 మంది గురించి పరిచయం చేశారు. ఒక్కొక్క కవి గురించి ప్రత్యేకంగా పరిశోధన చేయాల్సినంత విస్తృతి, వైశాల్యం కలిగిన సాహితీవేత్తలు ఇందులో ఉన్నారు. రేఖామాత్ర పరిచయంలోనే వారి విశిష్టత బోధపడుతుంది. పాలమూరు సాహిత్యచరిత్ర మీద పరిశోధనలు చేయాలనుకునే వారికి ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తం.

- శశాంక

సంక్లిష్టతల్ని పరిష్కరించే దిశగా...

రేణ మరికొన్ని కథలు
రచన: చైతన్యప్రకాశ్, పేజీలు: 156, వెల: రూ. 100
ప్రతులకు: పుట్ట పుస్తక శిబిరం, ఆలగడప,
మిర్యాలగూడ-508 207, నల్లగొండ జిల్లా

ఇరవై, ముప్పయి ఏళ్ళ కిందటితో పోలిస్తే జీవితంలో పెద్ద మార్పులేమీ కనిపించవు. అయినప్పటికీ అభివృద్ధి గురించి పెద్దపెద్ద మాటలు చెబుతారు. వాస్తవానికి రెక్కల కష్టమ్మీద బతికే మనుషుల బతుకు తీరులో గొప్ప మార్పులేమీ రాలేదు. ఈ వాస్తవాన్ని తన కథల ద్వారా ఆవిష్కరించిన రచయిత చైతన్యప్రకాశ్. అతని కథల సంపుటి 'రేణ'. అతను పుట్టి పెరిగిన 'కొండాపూర్' ఈ పుస్తకంలోని అనేక కథలకు కేంద్రం. నలభై నాలుగేండ్ల వయసులో బతుక్కి సంబంధించిన అనేక కోణాల్లోంచి ఆలోచనలు చేసే రచయిత కథలు ఎలా వుంటాయో తెలుసుకోడానికి ఈ కథలు చదవాలి. పుస్తకంలో పన్నెండు కథలున్నాయి. అల్లం రాజయ్య, నలిమెల భాస్కర్ రాసిన ముందుమాటలు ఈ కథల నేపథ్యాన్ని, రచయిత ఆలోచనా స్రవంతిని ఆకళింపు చేసుకోడానికి ఉపయోగపడతాయి. తెలంగాణ మాండలికాన్ని పదునైన రీతిన వ్యక్తం చేశారు రచయిత. గ్రామీణ జీవితంతో వున్న సంబంధం ఈ కథలకు మూలం. ఆయా పాత్రలు, సంభాషణలు, సన్నివేశాలు సంక్లిష్టమైన మానవ సంబంధాల్ని చిత్రిస్తాయి. ఈ సంక్లిష్టతల పరిష్కారం ఏమిటన్న ఆలోచనలకు పురిగొల్పడంలో ఈ కథలు సాఫల్యాన్ని సాధించాయి. 'రేణ' ప్రత్యేకంగా చదివి చర్చించాల్సిన కథ. ఈవిధంగా ప్రతి కథలోని ప్రత్యేకతల్ని తరచి చూస్తే అనేకానేక అంశాలు బోధపడతాయి.

- ఎస్.దుర్గాప్రసాద్

చదివించే నవల హాఫ్ గర్ల్ ఫ్రెండ్

అత్యంత ప్రజాదరణ పొందిన ఈ శతాబ్దపు-ఇంగ్లీషు నవలలు రాసే భారతీయ రచయితల్లో ముందుగా చెప్పుకోవలసింది చేతన్ భగత్ పేరు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఆయన రాసిన "హాఫ్ గర్ల్ ఫ్రెండ్" నవలను విడుదల చేశారు. లోగడ రాసిన నవలన్నింటికంటే దీటుగా నిలిచిందీ నవల.

ఈ నవలలోని కథాంశాన్ని క్లుప్తంగా చెప్పాలంటే...మాధవ్ ఝా అనే ఓ బీహారీ యువకుడు ఢిల్లీలోని ఓ ప్రముఖ ఇంగ్లీషు మీడియం విద్యాసంస్థలో స్పోర్ట్స్ కోటాలో ప్రవేశం సాధిస్తాడు. బాస్కెట్‌బాల్ ఆడటం బాగా వచ్చు. మాధవ్ వంశీకులు ఒకప్పుడు రాజులు, రాజ్యాలు, సంస్థానాలు పోగా మాధవ్ తల్లి తమ హవేలీలో బీద పిల్లలకు చదువు నేర్పుతూ ఉంటుంది. రిచా సోమానీ అనే ధనవంతుల అమ్మాయి అదే కాలేజీలో ఇంగ్లీషు లిటరేచర్ చదువుకై చేరుతుంది. రిచాకు బాస్కెట్ బాల్ ఆడటం వచ్చు. మాధవ్, రిచాలకు బాస్కెట్‌బాల్ కోర్టులో పరిచయమై స్నేహితులవుతారు. మాధవ్ తానుండే హాస్టల్ వాచ్‌మెన్ కళ్లు గప్పి రిచాను తన హాస్టల్ రూంకు తీసుకెళ్ళతాడు. హాస్టల్ గదిలో మాధవ్ రిచాతో మరింత 'దగ్గరి' సంబంధాన్ని కోరతాడు. రిచా తిరస్కరిస్తుంది. "గర్ల్ ఫ్రెండ్ అన్నాక ఇది మామూలే కదా" అన్న మాటకు రిచా తాను "హాఫ్ గర్ల్ ఫ్రెండ్"గానే ఉంటానంటుంది. తన పెళ్ళి ఓ బ్రిటిష్ ఎన్.ఆర్.ఐతో నిశ్చయం అయిందని శుభలేఖ కూడా ఇస్తుంది. ఇద్దరి చదువులు అయిపోయాయి కనుక వీడ్కోలు తీసుకుంటారు. రిచా జ్ఞాపకాలు మాధవ్‌ని వేధిస్తుంటాయి. హెచ్.ఎస్.బి.సి. అనే సంస్థలో మాధవ్‌కు ఉద్యోగం వచ్చినా తిరస్కరించి తన స్వంత ఊరుకు వచ్చి తల్లికి సాయంగా ఉంటాడు. బిల్‌గేట్స్ భారతదేశం వస్తున్నాడని, బీహార్ రాష్ట్రానికి కూడా వస్తున్నాడని తెలుస్తుంది. ఎమ్మెల్యే ద్వారా బిల్‌గేట్స్ తమ స్కూలు సందర్శించే ప్రయత్నం చేస్తాడు మాధవ్. బిల్‌గేట్స్ తమ స్కూల్‌కి వస్తే ఉపన్యాసానికి, సంభాషణకు సౌలభ్యంగా ఉంటుందని ఇంగ్లీషు నేర్చుకోవడానికి పాట్నా వెళ్తాడు. ఓ రోజు ఓ అయిదు నక్షత్రాల హోటల్లో రిచాను చూస్తాడు. రిచా తన భర్తతో సరిపోక విడాకులు తీసుకుని ఇండియాకు వచ్చి ఓ ఉద్యోగంలో చేరుతుంది. ఉద్యోగ రీత్యా రిచా పాట్నాకు వస్తుంది. ఇరువురి మధ్య మళ్లీ సాన్నిహిత్యం పెరుగుతుంది. ఈ మధ్యకాలంలో లోకాన్ని ఆకళింపు చేసుకున్నా ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉంటారు. మాధవ్ స్కూలుకు బిల్‌గేట్స్ వచ్చిన రోజు రిచా కూడా అక్కడే ఉంటుంది. బిల్‌గేట్స్ వెళ్ళగానే ఆమె కూడా మాధవ్‌కు దూరమవుతుంది. ఎక్కడికి వెళ్ళిందో మాధవ్‌కు తెలీదు. ఉద్యోగం విడిచి పెట్టి వెళ్ళిందని మాత్రం తెలుస్తుంది. ఎంత ప్రయత్నించినా రిచా ఎక్కడుందో మాధవ్ తెలుసుకోలేకపోతాడు. అనుక్షణం ఆమె జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఓ చిన్న 'క్లూ' ఆధారంగా రిచా అమెరికా వెళ్ళి ఉంటుందని ఊహించి, మాధవ్ కూడా అమెరికా వెళ్ళి న్యూయార్క్ నగరం అంతా గాలించి ఆమెను వెదికి పట్టుకుంటాడు. ఇద్దరూ దంపతులై, మాధవ్ స్కూల్‌కి అంకితమవుతాడు. వాళ్ళకు 'శ్యాం' అనే కొడుకు పుట్టడంతో నవల ముగుస్తుంది.

'ఆడ స్నేహితురాలు' అంటే శారీరక సంబంధం ఉండి తీరాలన్నా ఆలోచన సరైంది కాదు. పైపెచ్చు యువతను తప్పుదోవ పట్టించవచ్చు. రిచాకు 'లంగ్ కేన్సర్', ఆమె న్యూయార్కు వెళ్ళడం, వెంట్రుక పోగులాంటి ఆధారంతో మాధవ్ రిచాను న్యూయార్క్‌లో కలవటం సహజత్వానికి దూరంగా ఉంది. ఆమె లంగ్‌కేన్సర్ బహుశా నవలను పొడిగించటానికి పనికి వచ్చి వుంటుంది. చదివించే గుణం కారణంగా ఈ నవల ఆదరణ పొందింది. దీనికి శాంతసుందరి అనువాదం సరళ సుందరంగా వుంది.

- కూర చిదంబరం, 8885552423

జలదృశ్యం

– ఏనుగు నరసింహారెడ్డి

మైసమ్మను నెత్తిన మోస్తూ
నిరంతర ధ్యాన ముద్రలో
నిశ్చలంగా కూర్చుండిపోయేది కట్ట.
జీవనానికి పర్యాయపదమై
కాలానికి వారధికట్టి
తెరుచుకుంటూ మూసుకుంటూ
పంటకు ప్రాణం పోసేది తూము.
పరువంలో పడుచువాడిలా
వాన వంతెన మీంచి దూకి
గంతులేసేది అలుగు

శికం నిండా జలం
పరిసరమంతా చిత్తడి
అందిన మేరా ఆకుపచ్చ తివాచీ పరిచే
మబ్బు తునకల గలగలలు



నీటి అద్దం మీద కొంగలు
సింగారించుకునే దృశ్యం
శత సహస్రాలుగా విస్తరించే
జీవరాశి పరిమళం
తీతువు పిట్టలకు
చాకిరీ చేసే తుమ్మకొమ్మలు
లంగరేసిన ఓడ జెండాలా
గాలికి ఎదురీదే చెట్ల సమూహం
దీపం చుట్టూ మెరిసే వెలుగు రేఖల్లా
జారుతున్న పంట కాలువ గట్ల మీద
పూల తీగల పులకరింతలు
తల్లి ఒడిలో ఖుషీ చేసే పిల్లవాడిలా
జల దృశ్యం ముంగిట ఊరు

అవసరం మిక్కుటమై
అలుగుకు గాట్లు పెట్టకముందు
వాడకం వైరమై
తూముకు తుప్పు పట్టక ముందు
బోర్ల తూట్లు పడి
జలగర్భం విచ్ఛిన్నం కాకముందు
నీటి ముద్దుల్తో నునుపుదేరిన
పరుపు బండల పక్కటెముకల మీద
బహుళ అంతస్తులు మొలవక ముందు
జీవనం శికస్తుకాకముందు
ఇక్కడొక నాకలోకపు నఖలుండేది
దాన్ని ఎవరు పునర్నిర్మిస్తారు?

సెల్ : 8978869183

పుష్యరాగం

పోకబంతి మిన్ను చామంతి నా మట్టి
చిట్టి చేమంతులా నవ్వుకుందాం.

ముద్దబంతి సొగసు ముద్దులా ప్రియురాలా
రెక్కబంతిపూలై విచ్చుకుందాం.

– నందకిషోర్

పట్నాల బంతిపై పవ్వళిద్దాం మనం
ఎర్రాని ఏడుపుని ముడుచుకుంటూ...

మసకలోకం మొక్కు
దేవుడెవడో

ప్రియసఖీ!
దండలై మురిసిపోదాం.

***

భోగిమంటల్లోన తానాలు ఆడుతూ
చలిమంచు వలువల్ని తడుపుకుందాం.

పుష్యరాగం విసిరె పువ్వులా ధనువయ్యి
తొలిరాత్రి ముచ్చట్లు తలచుకుందాం.

రంగవల్లుల నేల కొత్తచీరె నీకు
రంగురంగుల ఊహ రవిక అంచు

మసకలోకానిపై
కోపమొద్దు.

ప్రియసఖీ!
నింగినే చుట్టుకుందాం.

***

బంతిపూల రెక్క గొబ్బియల్లో పాట
రేగుపళ్ళా తీపి పొద్దులోన

జంగమయ్యాగంట గంగిరెద్దూ ఆట
సకినాల కరకరలు మనసులోన

హరిదాసులేలకో ఆనందవనముల్లో
హరితాల వర్ణించు కాంతి నువ్వు

మసకలోకానిపై
చల్లుకుంటూ

ప్రియసఖీ!
పువ్వులతో ముగ్గువేద్దాం.

సెల్ : 871282212



సైకిల్ చైనులో శునకరాజమా...

'శివ' సినిమాతో సైకిల్ చైన్‌కి ఎంత క్రేజ్ వచ్చిందో తెలిసిందే. అదే సైకిల్ చైన్లతో శునక మహారాజులను తయారు చేస్తోంది నిరిత్ లెవావ్. పాడైపోయి, ఇక పనికి రావనుకున్న సైకిళ్ళను చూస్తే చాలు నిరిత్‌కి ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొస్తుంది. సైకిల్ భాగాలైన చైన్, సీటు, చిన్న నట్లు, తాళాలు, ఇనుప రాడ్లు... ఏవైనా గానీ ఆమె చేతిలో పడితే అందమైన బుజ్జి బుజ్జి కుక్కపిల్లలు తయారవ్వాల్సిందే. చూడండి మరిముడి సరుకు ఒక్కటే అయినా ఎన్ని రకాల గ్రామ సింహాలో

పొడవైన చెట్టు

కాలిఫోర్నియాలోని సెకోయియా నేషనల్ పార్క్‌లో ఉన్న ఈ పొడవాటి జెయింట్ సెకోయియా (ప్రెసిడెంటు చెట్టు). వినడానికి భలేగా వుంది కదూ! ప్రపంచంలోని అతి పొడవైన చెట్లలో మూడవ స్థానంలో ఉందీ చెట్టు. ప్రపంచంలో వేగంగా ఎదిగే చెట్టు కూడా ఇదే. 3,200 ఏళ్ళ చరిత్ర వుందీ చెట్టుకి. దీని ఎత్తు 75, వెడల్పు 8.2 మీటర్లు. వైశాల్యం 45,000 ఘనపు అడుగులు. మామూలు కెమెరాలతో ఒకేసారి చెట్టుమొత్తం ఫొటో తీయడం అసాధ్యం. ఈ చెట్టు పరిశోధకులు 32 రోజులు కష్టపడిన తర్వాత గానీ దీని పూర్తి రూపం మనం చూడ్డానికి సాధ్యం కాలేదు. సముద్ర మట్టానికి అయిదు నుంచి ఎనిమిది వేల అడుగుల ఎత్తులో ఉంటాయీ చెట్లు.